ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
బుధవారం 3 జనవరి 2024





రేపల్లె: 5వ వార్డులో పేరుకుపోయిన చెత్తాచెదారం



ఇక పంచాయతీ.. పోరు?

- ఆందోళనలకు సిద్ధమైన కార్యదర్శులు
- విలువలేని ఉద్యోగాలతో అవమానాలు
- జీవో ఉన్నా విధులు ఇవ్వకపోవడంపై ఆగ్రహం
- పంచాయతీరాజ్ చట్టానికి విరుద్ధంగా వెట్టిచాకిరి
- సమ్మెతో న్యాయం జరుగుతుందన్న భావనలో ఉద్యోగులు

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విధులు లేవు.. విలువ లేదు.. అవమానాలు.. వెట్టిచాకిరీ ఉద్యోగాలపై.. గ్రామ సచివాలయాల్లోని గ్రేడ్- 5 పంచాయతీ కార్యదర్శులు పోరాటానికి సన్నద్ధమవుతున్నారు. అధికారాలు ఇస్తామని 2022లోనే ప్రభుత్వం జీవో 149 విడుదల చేసినా అవి పేపర్లకే పరిమితం కావడంతో కార్యదర్శులు రెండేళ్లుగా ఆందోళన చేస్తున్నారు. మరో మూడు నెలల్లో ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అంగన్వాడీ, ఆశ, మున్సిపల్ కార్మికుల ఆందోళనలతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో తమ డిమాండ్లు నెరవేరేందుకు ఇదే సరైన సమయమని భావించిన ఉద్యోగులు ఉద్యమానికి సన్నాహాలు చేసుకుంటున్నారు.

అస్తవ్యస్తం.. గందరగోళం

గ్రామ సచివాలయ ఉద్యోగుల నియామక ప్రక్రియ ఆది నుంచి అస్తవ్యస్తంగానే ఉంది. పంచాయతీరాజ్ చట్టం పరిధిలో గ్రామ పంచాయతీ విధులను నిర్వర్తించే కార్యదర్శులను ప్రభుత్వం గ్రేడ్- 5 పేరిట సచివాలయ వ్యవస్థలోకి తీసుకువచ్చి వారికి పంచాయతీ విధులు కాకుండా సచివాలయ విధులు కేటాయించింది. ఇది పంచాయతీరాజ్ చట్టం- 1994, జీవో 149కు పూర్తిగా విరుద్ధం. ఇలా పంచాయతీ కార్యదర్శులను పంచాయతీయేతర విధులకు వినియోగించడమే అసలు సమస్యకు మూలం. రాష్ట్రంలో ప్రస్తుతం 13,324 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2019కి ముందు వాటిలోని 7 వేల గ్రామ పంచాయతీలకు మాత్రమే కార్యదర్శులు ఉన్నారు. దీంతో రెండు, మూడు పంచాయతీలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ఒక్కో క్లస్టర్‌కు ఒక పంచాయతీ కార్యదర్శిని ఇన్‌చార్జిగా నియమించారు. క్లస్టర్ పరిధిలోని పంచాయతీల్లో గ్రేడ్-5 కార్యదర్శులకు బాధ్యతలు కేటాయించారు. దీంతో వారంతా అప్పటికే ఉన్న గ్రేడ్- 1, 2, 3, 4 కార్యదర్శుల కింద పనిచేయాల్సి వచ్చింది. దీంతో పంచాయతీ రికార్డులు, మినిట్స్ బుక్స్ నిర్వహించే సాధారణ అధికారాలు కూడా వారికి దక్కలేదు. సచివాలయ విధుల పేరుతో విధివిధానాలు లేని అనేక పనులు కేటాయించి వారిని వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 1230 గ్రామ సచివాలయాల్లో 568 గ్రేడ్ 5 కార్యదర్శులు ఉన్నారు. వీరంతా అప్పటికే ఉన్న సీనియర్ కార్యదర్శుల కింద పనిచేస్తున్నారు. సచివాలయాల్లోని ఇతర శాఖల మాదిరిగా ఆయా శాఖల విధులు మాత్రమే నిర్వహించడం కాకుండా సచివాలయ విధుల పేరుతో అనేక పనులు చేయాల్సి వస్తోంది. జగనన్న కాలనీల నిర్మాణం, ఓటీఎస్, ఆడుదాం ఆంధ్ర రిజర్వేషన్ సహా ప్రభుత్వం ఏ కార్యక్రమం తలపెట్టినా తొలి బాధితులు గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులే అన్నట్లుగా తయారైంది. దీనికి తోడు అప్పటికే ఉన్న సీనియర్ కార్యదర్శుల ఒత్తిడి భరించలేనిదిగా ఉంటోంది. జీవో వచ్చి రెండేళ్లు అవుతున్నా విధులు కేటాయించకపోవడంతో చెప్పలేని భారం పడుతోందని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులకు ఉండే డీడీవో పవర్ మాటేమోగానీ, కనీసం జనన, మరణ, వివాహ నమోదు, ధ్రువీకరణ పత్రాల జారీ, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల వంటి ప్రాథమిక విధులు కూడా వారికి దక్కలేదు.

ఒక పంచాయతీ.. ఒక కార్యదర్శి మాటేమిటో?

దాదాపు నాలుగున్నరేళ్ల క్రితం గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల నియామకం జరిగినా 'ఒక పంచాయతీ- ఒక కార్యదర్శి' అన్న నియమానికి మోక్షం మాత్రం దక్కలేదు. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీల సంఖ్యతో సమానంగా కార్యదర్శులు ఉన్నా అది ఆచరణకు నోచుకోలేదు. ఉద్యోగుల ఆందోళన చేసినప్పుడల్లా తూతూమంత్రపు చర్యలు తీసుకోవడమే తప్ప ఫలితం లేదు. 'ఒక పంచాయతీ ఒక కార్యదర్శి' దస్త్రాలపై కిందటేడాది సెప్టెంబరులోనే ముఖ్యమంత్రి సంతకం చేసినప్పటికీ ఈ రోజు వరకూ అది ఆచరణకు నోచుకోలేదు. సాక్షాత్తు ముఖ్యమంత్రి ఆమోదముద్ర వేసినా అది ఆచరణకు ఎందుకు నోచుకోలేదో తెలియక ఉద్యోగులు అయోమయంలో పడిపోయారు. ముఖ్యమంత్రికి తెలియకుండా పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులే దాన్ని తొక్కిపెట్టారని ఆలోచిస్తున్నారు. ఇది ప్రభుత్వం ఆడుతున్న 'జగన్నాటకమ'ని గ్రహించలేక ముఖ్యమంత్రికి తెలిసి ఉండదని అమాయకంగా నమ్ముతున్నారు. రేపు ప్రభుత్వం మారితే తమ పరిస్థితి ఏమిటో తెలియని అయోమయస్థితిలో తాడోపేడో తేల్చుకునేందుకు ఆందోళనా బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు.

చెత్త దుర్వాసన



- పట్టణాలు దుర్గంధభరితం
- గృహాల్లో పేరుకుపోయిన వ్యర్థాలు
- కార్మికుల సమ్మెతో ప్రమాదంలో ప్రజారోగ్యం
- ఎనిమిదో రోజుకు చేరిన పారిశుధ్య కార్మికుల సమ్మె
- నేటి నుంచి మరింత ఉధృతంగా మున్సిపాల్టీలో ఆందోళనలు

చెత్త చెదారాలు.. కాల్వలు నిండా మురుగు.. పొంగి రోడ్లపైకి వస్తోన్న మురికినీరు.. అపరిశుభ్రత.. దుర్వాసనలతో పట్టణాలు నిండిపోయాయి. చెత్త కుళ్లి దుర్వాసనను వెదజల్లుతుంది. చెత్త ఎత్తేవారు లేరు.. కాల్వలు తీసేవారు కనుమరుగు.. ఇళ్లలో చెత్త సేకరించే వారు రావడంలేదు.. కార్మికుల సమ్మెతో పట్టణాలు కంపోస్టుయార్డులుగా మారాయి. సమస్యలను పరిష్కరించాలని పారిశుధ్య కార్మికుల నిరవధిక సమ్మెతో మున్సిపల్ పట్టణాల్లో పారిశుధ్య సేవలు స్తంభించాయి. ఇంటింటా చెత్త సేకరణ లేకపోవడంతో ఇళ్లలో పేరుకుపోయిన వ్యర్థాలతో దుర్వాసన. కాల్వలు తీయకపోవడంతో మురుగు పొంగి ప్రవహిస్తోంది. పారిశుధ్య కార్మికుల సమ్మె మంగళవారంతో ఎనిమిదో రోజుకు చేరినా ప్రభుత్వం నుంచి బెదిరింపులు వస్తున్నాయే కాని వారి డిమాండ్ల పరిష్కారంపై ఆలోచించడంలేదు. మరోవైపు బుధవారం నుంచి మిగిలిన కార్మికులు కూడా నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నారు. ఇప్పటికే చెత్త చెదారాలతో నిండిపోయిన రోడ్లు.. ఇళ్లలోని వ్యర్థాలతో దుర్వాసన, దోమలతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడింది. ఎక్కడికక్కడ మున్సిపల్ అధికారులు ప్రైవేటు కార్మికులతో చెత్త ఎత్తే పనులను చేపట్టే ప్రయత్నాలను సమ్మెలోని కార్మికులు అడ్డుకుంటున్నారు. దీంతో తెనాలి, నరసరావుపేట తదితర ప్రాంతాల్లో ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల సహకారంతో బెదిరిస్తున్నా కార్మికులు వెనక్కి తగ్గడంలేదు.

నరసరావుపేట, జనవరి 2: రహదారుల్లో చెత్త పేరుకుపోయింది. మురుగు కాల్వలు పూడిక తీతకు నోచుకోవడంలేదు. మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. కార్మికుల సమ్మెతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడనున్నది. రోజురోజుకు అపరిశుభ్రత తీవ్రమవుతుండటంతో రోగాల బారిన పడతామని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మున్సిపాల్టీల్లోని రహదారులు కంపోస్టు యార్డులుగా మారిపోయాయి. ఎక్కడికక్కడ చెత్త చెదారాలు పేరుకుపోయాయి. డంపర్‌బిన్లు నిండిపోయాయి. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నా కార్మికులు అడ్డుకుంటున్నారు. పారిశుధ్య కార్మికుల సమ్మె ఉధృతంగా కొనసాగుతోంది. పురపాలక సంఘ కార్యాలయాల వద్ద కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం దిగిరాకుంటే అత్యవసర సేవలను నిలిపివేస్తామని కార్మికులు హెచ్చరిస్తున్నారు. ఎన్నికల ముందు వైసీపీ అధినేత జగన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కార్మికులను మోసగించారని కార్మిక సంఘాల నేతలు విమర్శిస్తున్నారు. హామీలను అమలు చేయాలని గతంలో కూడా సమ్మె చేయగా అప్పుడు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకుండా కార్మికులను దారుణంగా ప్రభుత్వం మోసగించిందని కార్మికులు మండిపడుతున్నారు. డిమాండ్లు సాధించే వరకు సమ్మె వీడేది లేదని తేల్చి చెబుతున్నారు.

నేటి నుంచి సంపూర్ణంగా సమ్మె..

ఇప్పటికే కొంతమంది కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్నారు. బుధవారం నుంచి మిగిలిన కార్మికులు కూడా సమ్మెలోకి వెళ్లనున్నారు. ఇప్పటికే వారు మున్సిపల్ అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చి ఉన్నారు. దీంతో మున్సిపల్ కార్మికుల సమ్మె మరింత ఉధృతం కానున్నది. ఇప్పటి వరకు సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాల కార్మికులు సమ్మెలో పాల్గొంటుండగా బుధవారం నుంచి ఏఐటీయూసీ అనుబంధ సంఘ కార్మికుల కూడా సమ్మెలో పాల్గొనను న్నారు. దీంతో మున్సిపాల్టీలో సంపూర్ణంగా సమ్మె జరగనున్నది. పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మాచర్ల, దాచేపల్లి, చిలకలూరిపేట, వినుకొండ, గురజాల మునిసిపాల్టీలలో సమ్మె జరుగుతోంది. బాపట్ల జిల్లాలోని చీరాల, బాపట్ల, అద్దంకి, గుంటూరు జిల్లాలోని తెనాలి, మంగళగిరి, తాడేపల్లి, గుంటూరు కార్పొరేషన్‌లో నిరవధిక సమ్మె ఉధృతంగా కొనసాగుతుంది.



కార్మిక సంఘ నేతలకు వార్నింగ్ ఇస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ఎమ్మెల్యేతో వాగ్వాదం.. అరెస్టు

- పారిశుధ్య పనులను అడ్డుకున్న కార్మికులు
- నరసరావుపేటలో పోలీసులు, కార్మికుల మధ్య తోపులాట

నరసరావుపేట: పారిశుధ్య కార్మికులు సమ్మె సందర్భంగా నరసరావుపేటలో మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. ప్రైవేట్ కార్మికులతో పారిశుధ్య పనులు చేపట్టడాన్ని సమ్మె చేస్తున్న కార్మికులు అడ్డుకున్నారు. పార్టీ శ్రేణులతో కలసి పారిశుధ్య పనుల్లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొనగా కార్మి కులు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డికి కార్మికుల మధ్య వాగ్వావాదం చోటుచేసు కుంది. పారిశుధ్య పనులను అడ్డుకుని వారిపై చెత్త పోసి కార్మికులు నిరసన తెలిపారు. దీంతో పోలీసులు కార్మికులను అదుపులోకి తీసుకునే క్రమంలో వారి మధ్య తోపులాట జరిగింది. అనంతరం వారిని ఒకటో పట్టణ పోలీ సుస్టేషన్‌కు తరలించగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ స్టేషన్ ఎదుట మిగిలిన కార్మికులు ధర్నా చేశారు. చంద్రబాబుకు కార్మికులు అమ్ముడుపోయారని ఎమ్మెల్యే ఆరోపించారు. ప్రభుత్వం రూ.22 వేలకు జీతాలు పెంచినా సమ్మె చే యడం సరైనదేనా అని కార్మికులను ఎమ్మెల్యే నిలదీశారు. అబద్ధాలు ఆడొద్దని కార్మిక సంఘం నాయకురాలు శివకుమారి అన్నారు. రౌడీలను తీసుకొచ్చి ఎమ్మెల్యే దాడులు చేయించారని ఆమె విమర్శించారు. మీరు అమ్ముడుపోయినట్లు కార్మిక నాయకులు అమ్ముడు పోతారనుకుంటే ఎలా అని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. తొలుత మున్సిపల్ బంగళా వద్ద చెత్త తరలింపు లారీలను కార్మి కులు అడ్డుకున్నారు. గుంటూరురోడ్డులో క్లాప్ ఆటోలను విని యోగించే ప్రయత్నాలను కార్మికులు నిరోధించారు. కార్మికుల అరె స్టు, ఎమ్మెల్యే వైఖరిపై నిరసనకు దిగిన కార్మికులు పలు ప్రాం తాల్లోని డంపర్‌బిన్లలోని చెత్తను రోడ్లపై కుమ్మరించారు. డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



నరసరావుపేటలో కార్మికులు పోలీసుల మధ్య తోపులాట

కాళ్లు విరగ్గొడతా.. లోపలేయిస్తా

- సమ్మె ముగిశాక ఉద్యోగం ఎలా చేస్తారో చూస్తా
- పారిశుధ్య కార్మికులకు తెనాలి హెల్త్ ఆఫీసర్ బెదిరింపు

తెనాలి (ఆంధ్రజ్యోతి): 'ప్రతి ఒక్కరినీ గుర్తుపెట్టుకుంటా.. సమ్మె ముగిశాక ఉద్యోగం ఎలా చేస్తారో చూస్తా. అడుగు ముందుకు వేస్తే కాళ్లు విరగ్గొడతా.. పోలీస్ కేసులు పెట్టించి లోపలేయిస్తా..' అంటూ సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులకు వేలుచూపించి మంగళవారం తెనాలి మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ నిర్మల హెచ్చరించారు. దీంతో కార్మికులు ఒక దశలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు కార్మికులను సమ్మెలోని పారిశుధ్య కార్మికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ట్రాక్టర్‌లకు అడ్డుగా పడుకుని కదలనివ్వలేదు. మున్సిపల్ అధికారులు పోలీసుల సహ కారంతో కార్మికులను పక్కకు లాగేసి ట్రాక్టర్లను ముందుకు తీసుకువెళుతుండగా వారు ఆందోళనకు దిగారు. ఈ తరుణంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ నిర్మల వారిపై తీవ్ర స్థాయిలో బెదరిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయబద్ధంగా సమ్మె చేస్తున్నాము.. మీరూ సమ్మెలు చేశారు.. అప్పుడు న్యాయమైనప్పుడు మేము ఆందోళన చేస్తుంటే అడ్డుకోవటం సబబేనా అని మహిళా కార్మికులు ఆమెను ప్రాధేయపడ్డారు. ఇన్ని రోజులు ప్రైవేటు కార్మికులతో పారిశుధ్య పనులు చేయించుకున్నా మాట్లాడలేదని, రాష్ట్ర సంఘం పిలుపు మేరకు అడ్డుకుంటున్నామని, సహకరించాలని కోరారు. అయితే ఆమె అందుకు అంగీక రించకపోగా మరింతగా మండిపడ్డారు. పోలీసులతో వారిని పక్కకు నెట్టేయించి వీరిలో ఒక్కరికి కూడా మస్టర వేయొద్దని, తనకు చెప్పకుండా ఎవరినీ విధుల్లోకి తీసుకోవద్దంటూ ఆమె ఆదేశాలు ఇచ్చారు. దీంతో కార్మికులు ఆమెపై మరింతగా అసహనం వ్యక్తం చేస్తూ వాదనకు దిగి సమ్మె హక్కును కాలరాస్తారా అంటూ రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. మహిళా పోలీసులు పారిశుధ్య కార్మికులను అడ్డుకోవడం, పెనుగులాట వంటి వాటితో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.



తెనాలిలో పారిశుధ్య కార్మికులను బెదిరిస్తున్న హెల్త్ ఆఫీసర్ నిర్మల



పొన్నూరు: ఎన్జీ రంగా విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులు




బాపట్ల మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఐదు ఆలయాలకు హోదా పెంపు

- డీసీ స్థాయికి పెదకాకాని మల్లన్న సన్నిధి
- ఏసీ స్థాయిలో మరో నాలుగు ఆలయాలు
- గజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన దేవదాయ ఏసీ
- త్వరలో ఆలయాలకు కొత్త అధికారుల నియామకం

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 2: ఏళ్ల తరబడి హోదా పెంపుకోసం ఎదురుచూస్తున్న ఆలయాల నిరీక్షణ తొలగిపోయింది. ఆదాయాన్ని బట్టి హోదా పెంచుతూ మంగళవారం దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ గజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. దీని ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఐదు ఆలయాల హోదా పెరిగింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.2 కోట్ల నుంచి రూ.7 కోట్ల ఆదాయం ఉన్న ఆలయాలకు అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) కార్యనిర్వాహణాధికారి(ఈవో), ఆదాయం రూ.7 కోట్ల నుంచి రూ.12 కోట్ల వరకు ఆదాయం ఉన్న ఆలయాలకు డిప్యూటీ కమిషనర్ (డీసీ) ఈవోలుగా ఉండనున్నారు. ఇంత ఆదాయం కలిగిన ఆలయాలు ఐదు మాత్రమే ఉండటంతో ఆయా ఆలయాల హోదాను పెంచుతూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పెదకాకాని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానం ప్రస్తుతం ఏసీ క్యాడర్లో ఉండగా, ప్రభుత్వం డీసీ స్థాయికి మారుస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మంగళగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం, అమరావతి అమరలింగేశ్వరస్వామి దేవస్థానం, కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం, అడిగొప్పల నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దేవస్థానాల స్థాయిని పెంచారు. ఈ ఆలయాలకు ఇప్పటి వరకు గ్రేడు - 1 అధికారులు ఈవోలుగా ఉండగా, త్వరలో అసిస్టెంట్ కమిషనర్లను కార్యనిర్వహణాధికారులుగా నియమించను న్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఏసీలుగా కొనసాగుతున్న కేటీ శ్రీనివాసరావు, డీ శ్రీనివాసరావు, బీ మహేశ్వర్‌రెడ్డి, ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ రవణమ్మ తదితరులకు డిప్యూటీ కమిషనర్‌గా ఉద్యోగోన్నతులు పొందనున్నారు.



మంగళగిరి నృసింహుడు దేవాలయం



సాగర పరిక్రమతో అభివృద్ధి

- నిజాంపట్నం హార్బర్‌లో రూ.455 కోట్లతో పనులు
- కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాల

రేపల్లె, జనవరి 2: సాగర పరిక్రమతో సముద్రతీర ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని, మత్స్యకారుల జీవితాలు మారుతాయని కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాల తెలిపారు. నిజాంపట్నం హార్బర్‌లో మంగళవారం మత్స్యకారులతో ముఖాముఖి నిర్వహించిన కేంద్రమంత్రి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాగర పరిక్రమ ద్వారా 146.15 లక్షల మంది కి లబ్ధి చేకూరుతుందన్నారు. చెన్నై పోర్టు నుంచి ప్రారంభమైన పదో దశ సాగర పరిక్రమలో భాగంగా జువ్వలదిన్నె, కొత్తపట్నం, చీరాల ఓడరేవు, నిజాంపట్నం, గిలకలదిండి, మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్లు, ఆక్వా ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఆపరేషన్ 20 ద్వారా రూ.20 వేల కోట్లతో కేంద్రం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. రాష్ట్రంలో నాలుగు ఆక్వా పార్కులు మంజూరు కాగా వాటిలో నిజాంపట్నం ఒకటని రూ.455 కోట్లతో హార్బర్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 70 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. చెన్నై నుంచి మినీ బోట్లలో జలమార్గం గుండా ప్రయాణించి మత్స్యకారుల స్థితిగతులు, ఆర్థిక పరిస్థితులను తెలుసుకుంటున్నామన్నారు. పేద మత్స్యకారులకు కేసీసీ కార్డులు, రూ.లక్ష చొప్పున సబ్సిడీ రుణాలు అందిస్తున్నామన్నారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సముద్ర తీర మత్స్యకారులకు సబ్సిడీపై రుణాలు, రూ.5 లక్షల గృహ రుణ సదుపాయం, నివేశన స్థలాలను మంజూరు చేయాలన్నారు. సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మత్స్యకారులకు జీపీఎస్ ఎకోసైండర్, లైఫ్ జాకెట్లు, సబ్సిడీ రుణాలపై పొందిన వ్యాన్లను అందజేశారు. తొలుత నిజాంపట్నం హార్బర్ రోడ్డులో రొయ్యపిల్లలను పరిశీలించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎంపీ నందిగం సురేష్, మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు, మత్స్యశాఖ సహాయ కమిషనర్ రీతూప్రసాద్, మత్స్యశాఖ జేడీ సురేష్, మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జున్‌రావు, వైసీపీ రేపల్లె ఇన్‌చార్జ్ డాక్టర్ ఈవూరి గణేష్, సంయుక్త కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, మత్స్య పరిశ్రమ అభివృద్ధి సంస్థ సీఈవో డాక్టర్ కేఎల్ మూర్తి, ఆర్డీవో హేలా షారాన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జీ.చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల

వినూత్నంగా.. ఆందోళనలు

దున్నపోతుకు వినతిపత్రాలతో నిరసన

బాపట్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): దున్నపోతు మీద వర్షం కురిసిన చందంగా ప్రభుత్వం తీరు ఉందని అంగన్‌వాడీలు దున్నపోతుకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళనలు మంగళవారంతో 22వ రోజుకు చేరాయి. బాపట్ల ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. అనంతరం ప్రదర్శనగా ఉప్పరపాలెం వెళ్ళి అక్కడ దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు. రేపల్లె, భట్టిప్రోలు, కొల్లూరు, చుండూరుల్లోని దీక్ష శిబిరాల వద్దకు దున్నపోతులను తీసుకువచ్చి అంగన్‌వాడీలు వినతిపత్రాల్ని అందజేశారు. రేపల్లెలో అంగన్‌వాడీలు నెహ్రూ విగ్రహానికి గులాబి పువ్వు ఇచ్చి నిరసన తెలిపారు.



బాపట్లలో దున్నపోతుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం

దిక్సూచి DIKSUCHI

పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ

పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు 'భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం', 'రాజ్యాంగ పరిషత్' అంశాలను చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. తొలుత రాజ్యాంగంలోని అన్ని అంశాలను అర్థం చేసుకోవాలి. ఆ తరవాత భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం, రాజ్యాంగ పరిషత్ అనే అంశాలను ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.

1600 సంవత్సరంలో ప్రారంభం అయిన ఈస్టిండియా కంపెనీ గురించి తెలుసుకున్న తరవాత, 1773 రెగ్యులేటింగ్ చట్టం, 1781 విస్తరణ చట్టం, 1784 పిట్స్ ఇండియా చట్టం గురించి తెలుసుకోవాలి. 1600 నుంచి 1784 మధ్య కాలంలో ఇతర అంశాలను ఆధునిక భారతదేశ చరిత్రతతో అనుసంధానం చేసుకోవాలి. 1793 చార్టర్ చట్టం నుంచి 1853 చార్టర్ చట్టం వరకు ఉన్న నాలుగు చట్టాలను తులనాత్మకంగా అధ్యయనం చేయాలి. అదేవిధంగా 1858 భారత రాజ్యాంగ చట్టం అర్థం చేసుకున్న తరవాత 1909, 1919 చట్టాలను పరిశీలించాలి. అనంతరం 1935 భారత ప్రభుత్వ చట్టాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. 1793, 1813, 1833, 1853, 1909, 1919, 1935 చట్టాల్లోని ఈస్టిండియా కంపెనీ, బ్రిటిష్ పాలన పరిణామక్రమాన్ని అర్థం చేసుకోవాలి. ఆధునిక భారతదేశ చరిత్ర చదివిన అనంతరం ఈ చట్టాలను చదవడం అభ్యర్థులకు ఉపయుక్తంగా ఉంటుంది.

రాజ్యాంగ పరిషత్ ఎన్నికల నుంచి భారత రాజ్యాంగం ఆమోదం పొందే వరకు జరిగిన పరిణామాలను వరుసక్రమంలో అభ్యర్థులు గుర్తుంచుకోవాలి. అలాగే దేశవిభజన అనంతరం రాజ్యాంగ పరిషత్‌లో వచ్చిన మార్పులపై కూడా దృష్టి సారించాలి. ఆబ్జెక్టివ్ తరహా పోటీ పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు రాజ్యాంగ పరిషత్‌కు సంబంధించిన భిన్న కమిటీలు, వాటి ఛైర్మన్‌లు, ముసాయిదా కమిటీకి సంబంధించిన ఫ్యాక్ట్స్ గుర్తుంచుకోవాలి. రాజ్యాంగ పరిషత్‌పై వచ్చిన విమర్శలను కూడా పరిశీలించాలి.

చార్టర్ అంటే ఒప్పందం

రాజ్యాంగాన్ని అర్థం చేసుకోవడానికి ఆ దేశ పూర్వ పరిస్థితులను అధ్యయనం చేయడం చాలా అవసరం. భారత రాజ్యాంగానికి సుదీర్ఘమైన చారిత్రక నేపథ్యం ఉంది. ఇండియాలో వ్యాపార నిమిత్తం ఈస్టిండియా కంపెనీకి సంబంధించి బ్రిటిష్ రాణి ఎలిజబెత్ ఒక చార్టర్ ద్వారా 1600 డిసెంబరు 31న అనుమతిని ఇచ్చింది. చార్టర్ అంటే ఒప్పందం అని అర్థం. భారతీయ పరిపాలన వ్యవస్థ ప్రధానంగా బ్రిటిష్ పరిపాలన విధానాన్నే అనుసరించి ఉంటుంది(బ్రిటిషర్లు ఇండియాను కొన్ని వందల సంవత్సరాలకు పైగా పరిపాలించడం వలన వారి విధి, విధానాలు భారతదేశాన్ని ప్రభావితం చేశాయి). భారత రాజ్యాంగ పూర్వ చరిత్రపై పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు అనేక సందేహాలు ఉత్పన్నం అవుతాయి. చాలా మంది అభ్యర్థులు ఆధునిక భారతదేశ చరిత్రను, రాజ్యాంగ పరిణామక్రమాన్ని ఒకటిగానే భావిస్తారు. పాలిటీ విభాగంలో 1600 సంవత్సరంలో ఈస్టిండియా కంపెనీ(బ్రిటిష్) ప్రారంభం అవడం గురించి తెలుసుకొని, ఆ తరవాత 1773 రెగ్యులేటింగ్ చట్టం నుంచి కీలకమైన చట్టాల గురించి తెలుసుకోవాలి.

ఉదా:- 1773, 1793, 1813, 1853, 1858, 1861, 1909, 1919, 1935 మొదలైనవి.

అభ్యర్థులు ఆధునిక భారతదేశ చరిత్రపై పట్టు సాధించిన అనంతరం ఈ చట్టాల గురించి తెలుసుకోవడం ఉపయుక్తంగా ఉంటుంది. ఈ చట్టాలను అర్థం చేసుకునే క్రమంలో వచ్చిన క్రమానుగత మార్పులను కూడా అవగతం చేసుకోవాలి. ఆ తరవాత 1946లో రాజ్యాంగ పరిషత్ ఎన్నికల అనంతరం, 1950లో భారత రాజ్యాంగం అమలులోకి వచ్చే వరకు జరిగిన పరిణామాలను తెలుసుకోవాలి.



రాజ్యాంగ అభివృద్ధి క్రమమం

భారత రాజ్యాంగ చరిత్ర బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ పాలనలో క్రీ.శ.1600లో ప్రారంభమైంది. ఇండియాలో రాజ్యాంగ నిర్మాణానికి సంబంధించిన చారిత్రక నేపథ్యాన్ని ఆరు దశలుగా అధ్యయనం చేయవచ్చని 'బి.సి.రావత్' అభిప్రాయం.

1వ దశ: క్రీ.శ. 1600 - 1773
2వ దశ: క్రీ.శ. 1773 - 1858
3వ దశ: క్రీ.శ. 1858 - 1909
4వ దశ: క్రీ.శ. 1909 - 1919
5వ దశ: క్రీ.శ. 1919 - 1935
6వ దశ: క్రీ.శ. 1935 - 1947

బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ

1600 డిసెంబరు 31న భారతదేశంలో వ్యాపారం చేసుకోవడం కోసం ఈస్టిండియా కంపెనీ బ్రిటిష్ రాణి అనుమతి పొందింది.(ఈస్టిండియా కంపెనీ భారతదేశంలో వ్యాపారం కోసం ఏకస్వామ్య హక్కులను పొందింది అని గమనించాలి). ఆర్థికంగా బలమైన మూలాలు కలిగిన ఈస్టిండియా వ్యాపారాన్ని విస్తరించి క్రమంగా భారత భూభాగాలపై పాలనాపరమైన పట్టు సాధించింది. ఆ క్రమంలోనే 1639లో మద్రాస్‌ను, 1668లో బొంబాయిని, 1698లో బెంగాల్‌ను తమ ఆధీనంలోకి తెచ్చుకుంది. ఆ తరవాత కూడా ఈస్టిండియా కంపెనీ అనేక భారత భూభాగాలపై తన పాలనాపరమైన ఆధిక్యాన్ని కొనసాగించింది. ఆ క్రమంలో ఏకస్వామ్య హక్కులు కలిగిన ఈస్టిండియా కంపెనీ భారత్‌లో అవినీతి కార్యకలాపాలు, లంచగొండితనానికి పాల్పడింది. అలాగే ఉన్నత స్థాయి ఉద్యోగులు కూడా భారత పౌరుల నుంచి బలవంతంగా బహుమతులు కోరేవారు. ఇలాంటి కార్యకలాపాలను నివారించడానికి బ్రిటిష్ పార్లమెంట్ 1773లో రెగ్యులేటింగ్ చట్టం చేసింది.

1773 రెగ్యులేటింగ్ చట్టం - ముఖ్యాంశాలు

రెగ్యులేట్ అంటే నియంత్రణ. బ్రిటిష్ పార్లమెంట్ ఈస్టిండియా కంపెనీ కార్యకలాపాలను నియంత్రించడానికి చేసిన చట్టం కాబట్టి, దీన్ని రెగ్యులేటింగ్ చట్టం అంటారు. రెగ్యులేటింగ్ చట్టం-1773 భారతదేశానికి సంబంధించి బ్రిటిష్ పార్లమెంట్ చేసిన తొలి చట్టం. ఈ చట్టంలోని ముఖ్యాంశాలు....

- కలకత్తాలోని పోర్టు విలియంలో సుప్రీంకోర్టు ఏర్పాటుకు ఈ చట్టం ఆధారం
- బెంగాల్ గవర్నరును గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్‌గా పదోన్నతి కల్పించారు (బొంబాయి, మద్రాస్ ప్రాంతాల గవర్నర్‌లు బెంగాల్ గవర్నర్ జనరల్‌కు అధీనులుగా మారారు).(మొదటి గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్ - వారెన్ హేస్టింగ్స్).
- ఈస్టిండియా కంపెనీ ఉద్యోగులు ప్రైవేట్ వ్యాపారం చేసుకోవడం, స్థానికుల నుంచి లంచాలు, బహుమతులు తీసుకోవడాన్ని నిషేధించారు.
- ఈస్టిండియా కంపెనీ పాలకమండలి సభ్యులైన కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ భారతదేశంలో రెవెన్యూ, సివిల్, మిలిటరీ వ్యవహారాలపై బ్రిటిష్ ప్రభుత్వానికి నివేదిక పంపాలి.
- 1773 రెగ్యులేటింగ్ చట్టం చేసినప్పటికీ ఈస్టిండియా కంపెనీ లంచగొండితనాన్ని, అవినీతిని, బహుమతులు స్వీకరించడాన్ని బ్రిటిష్ పార్లమెంట్ నివారించలేకపోయింది. ఫలితంగా 1784 బ్రిటన్‌లో విలియం పిట్స్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు పిట్స్ ఇండియా చట్టం రూపొందించారు.



వి.చైతన్యదేవ్,
పోటీ పరీక్షల నిపుణులు

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/qpJzQhDలో చదవండి.

Nehru Trust's UK Travel Awards 2024

SCHOLARSHIP ALERT

Description: Nehru Trust's UK Travel Awards 2024 is an opportunity offered by the Nehru Trust for the Indian Collection at the Victoria and Albert Museum (NTICVA), for scholars or professionals working in museums, galleries, universities, or other specified institutions concerned with the preservation, study, and display of India's art and cultural heritage.
Eligibility: Open for Indian citizens who scholars or professionals working in museums, galleries, universities or other specified institutions concerned with the preservation, study and display of India's art and cultural heritage.
Prizes & Rewards: Up to £1,000 (one-time)
Last Date to Apply: 15-02-2024
Application mode: via email or post at: The Secretary Nehru Trust for the Indian Collections at the Victoria & Albert Museum The School of Arts and Aesthetics SAA Building II Jawaharlal Nehru University New Delhi - 110067 India; Email ID: info@nehrutrustvam.org
Short Url: www.b4s.in/aj/NUT1

Colgate Keep India Smiling Scholarship Programme

Description: An initiative of Colgate-Palmolive (India) Limited to provide financial assistance and support to individuals who are deserving and meritorious but may lack the resources to pursue their dreams.
Eligibility: Indian students who are currently enrolled in any year of the BDS (Bachelor of Dental Surgery) course in a recognised government or private institute in Maharashtra, Goa, Gujarat, Himachal Pradesh, and Andhra Pradesh. Applicants must have scored at least 60% marks in Class 12. The annual family income of the applicants from all sources must not exceed 8 lakh.
Prizes & Rewards: Financial assistance of 75,000
Last Date to Apply: 31-01-2024
Application: Online only
Short Url: www.b4s.in/aj/KSSI3

ADB Internship Program

Description: ADB Internship Program 2024 is an opportunity offered by the Asian Development Bank (a regional development bank, headquartered in the Ortigas Center located in the city of Mandaluyong, Metro Manila, Philippines), to students enrolled in master's or Ph.D. degrees.
Eligibility: Open for ADB member countries national including India who are enrolled in a master's or Ph.D. level program. Students must have an excellent command of English and be engaged in academic study in a field related to ADB's work. Applicants must have professional experience relevant to the assignment.
Prizes & Rewards: Stipend for the duration of the internship
Last Date to Apply: 15-02-2024
Application: Online Only
Short Url: www.b4s.in/aj/ADBI6

Nikon Scholarship Program 2023-24

Description: An initiative of Nikon India Private Limited to financially support students from underprivileged sections of society to pursue photography-related courses.
Eligibility: Open for Indian students who have completed Class 12 and are pursuing photography-related courses with a duration of three months or more. Annual family income should be less than INR 6 lakh.
Prizes & Rewards: Up to INR 1 lakh
Last Date to Apply: 15-01-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/NSP10

buddy4study.com

28 నుంచి గ్లోబ్‌స్టార్ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ సమ్మిట్

ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 3 వరకు యుఎం-మార్సల్ గ్లోబ్‌స్టార్ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ సమ్మిట్ న్యూఢిల్లీ, ముంబై నగరాల్లో జరుగనుంది. ఇండియన్ ఎడ్యుకేటర్స్, స్కూల్ లీడర్ల కోసం దీన్ని ఉద్దేశించారు. మిచిగాన్‌కు చెందిన యుఎం మార్సల్ ఫ్యామిలీ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌తో కలిసి గ్లోబ్‌స్టార్ కన్సల్టింగ్ సర్వీసెస్ ఈ సమ్మిట్‌ను నిర్వహిస్తోంది. మిచిగాన్ విశ్వవిద్యాలయానికి తోడు టౌబౌకాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ అర్బన్ ప్లానింగ్‌లోని మార్సల్ ఫ్యామిలీ ఆఫ్ ఎడ్యుకేషన్ నుంచి అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ సభ్యులు ఇందులో పాల్గొంటారు. వర్క్‌షాప్‌లు, పాఠశాల సందర్శన, కేస్ స్టడీస్, ప్యానల్ డిస్కషన్స్ ఈ సమ్మిట్‌లో భాగంగా ఉంటాయి.

రిజిస్ట్రేషన్ ఫీజు
లేట్ పాస్‌లు: రూ.1,50,000 (చెల్లింపునకు చివరి రోజు జనవరి 12)
స్కూల్ ప్యాకేజీ: రూ. రూ.3,25,000(ఒక్కో నగరంలో గరిష్ఠంగా పది పాఠశాలలు అందుబాటులో ఉంటాయి) (ఫీజుపై 18 శాతం జీఎస్టీ కూడా చెల్లించాల్సి ఉంటుంది.)
వెబ్‌సైట్: https://globestarcs.com/ummarsal-globestareducationsummit2024
ఈమెయిల్: info@globestarcs.com
ఫోన్ నెంబరు: +9191678 64136/37

నవ్య | చిత్రజ్యోతి



అప్పుడు అక్కడే ఉన్నా

జపాన్ వరుస భూకంప ఘటనలపై ఎన్టీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కొత్త ఏడాదిని కుటుంబంతో కలసి సెలబ్రేట్ చేసుకునేందుకు గత వారం ఆయన జపాన్ వెళ్లారు. భూకంప హెచ్చరికల నేపథ్యంలో సోమవారం రాత్రి ఆయన సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారు. ఈ విషయాన్ని ఎన్టీఆర్ సోషల్ మీడియా ద్వారా తెలిపారు. 'నేను క్షేమంగా ఇండియాకు చేరుకున్నాను. గతవారం అంతా నేను అక్కడే గడిపాను. వరుస భూకంప ఘటనలు జపాన్‌ను కుదిపేయడం బాధాకరం. అక్కడి ప్రజలు త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని తెలిపారు. ఎన్టీఆర్ ప్రస్తుతం కొరటాల శివ దర్శకత్వంలో 'దేవర' చిత్రంలో నటిస్తున్నారు. హిందీలో 'వార్ 2' చిత్రంలో కీలకపాత్ర పోషిస్తున్నారు.




కథ క్లైమాక్స్‌కొచ్చింది

'సలార్' చిత్రంతో బాక్సాఫీసు దగ్గర సంచలన విజయాన్ని అందుకున్నారు ప్రభాస్. 'యానిమల్' చిత్రంతో దేశవ్యాప్తంగా సినీ ప్రియులను ఉర్రూతలూగించిన దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా. ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్‌లో రూపుదిద్దుకోబోతున్న చిత్రం 'స్పిరిట్'. ఈ సినిమా గురించి ఓ ఇంటర్వ్యూలో సందీప్‌రెడ్డి వంగా పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. కొన్ని సన్నివేశాలు మినహా 'స్పిరిట్' కథ దాదాపు పూర్తయిందని తెలిపారు. ప్రభాస్ నిజాయితీపరుడైన పోలీసాఫీసర్‌గా కనిపిస్తారని చెప్పారు. యాక్షన్ ఘట్టాలు, కథలో మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తాయన్నారు. ప్రభాస్ పాత్ర శక్తిమంతంగా ఉంటుందని చెప్పారు. మానవ అక్రమ రవాణా నేపథ్యంలో 'షుగర్ ఫ్యాక్టరీ' అనే స్టోరీ సిద్ధమైందన్నారు. అలాగే భవిష్యత్‌లో మహేశ్‌బాబుతో కచ్చితంగా ఓ సినిమా చేస్తానని సందీప్‌రెడ్డి వంగా తెలిపారు.

క్రేజీ కాంబినేషన్ షురూ?

ఒకరితో సినిమా అనుకోవడం.. ఇంకొకరితో సినిమా చేయడం ఇవన్నీ పరిశ్రమలో కామన్. 'గుంటూరుకారం' తర్వాత త్రివిక్రమ్ సినిమా బన్నీతో ఉంటుందని అందరూ అనుకున్నారు. అయితే.. బన్నీ 'పుష్ప2' షూటింగ్ ఇప్పుడయ్యేలా లేదు. ఆ సినిమాను ఆగస్టులో విడుదల చేయనున్నట్టు నిర్మాతలు ప్రకటించారు. అంటే.. దాదాపు జులై దాకా షూటింగ్ జరుగుతూనే ఉంటుంది. మరోవైపు త్రివిక్రమ్ 'గుంటూరుకారం' రేపు సంక్రాంతికి వచ్చేస్తోంది. అంటే జులై దాకా ఆగాల్సిందే. అందుకేనేమో..! ప్రస్తుతం గురుజీ చూపు వెంకీవైపు మళ్లిందని ఫిలింనగర్ టాక్. ఈ లోపు వెంకటేశ్‌తో ఓ సినిమా చేసేయాలని ఆయన ఫిక్సయ్యారట. వెంకటేశ్ బ్లాక్‌బాస్టర్స్ నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాల రచయిత త్రివిక్రమే అన్న విషయం తెలిసిందే. వారిద్దరి కలయికలో సినిమా కోసం సగటు ప్రేక్షకుడు కూడా ఇష్టంగా ఎదురుచూస్తున్నాడు. త్రివిక్రమ్ కూడా వెంకీతో సినిమా చేయనున్నట్టు గతంలో ఓసారి చెప్పారు. ఎట్టకేలకు ఆ కాంబినేషన్ ఇప్పటికి సెట్ అయ్యిందని తెలుస్తోంది. అయితే.. ఇది వెంకీ సినిమా మాత్రమే కాదంట. ఇదో మల్టీస్టారర్ అని సమాచారం. రెండో హీరోగా నానీ నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడట. త్వరలోనే ఈసినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన విడుదల కానుందని విశ్వసనీయ సమాచారం.







నాకెప్పుడు న్యాయం జరుగుతుందో?

గాయని చిన్మయి మరోసారి తమిళ రచయిత వైరముత్తుపై విమర్శల దాడి చేశారు. కెరీర్ ఆరంభంలో తనను వైరముత్తు లైంగికంగా వేధించాడని 2018 మీటూ ఉద్యమం సమయంలో చిన్మయి ఆరోపించిన విషయం తెలిసిందే. అయితే తమిళ పరిశ్రమ వైరముత్తుపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా చిన్మయి పైనే నిషేధం విధించింది. గతేడాదే ఆ నిషేధం తొలగింది. వైరముత్తు రచించిన 'మహా కవితై' పుస్తకావిష్కరణ ఇటీవలే చెన్నైలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి స్టాలిన్, కాంగ్రెస్ నాయకుడు చిదంబరం, కమల్‌హాసన్ హాజరయ్యారు. ఈ నేపథ్యంలో చిన్మయి సోషల్ మీడియా వేదికగా తన ఆవేదన వ్యక్తం చేశారు. 'నన్ను లైంగికంగా వేధించడమే కాకుండా, నా కెరీర్‌ను నాశనం చేసిన వ్యక్తికి చాలా పెద్ద వ్యక్తుల మద్దతు ఉంది. నాకు ఎప్పుడు న్యాయం జరుగుతుందో?' అని స్పందించారు.



'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/HdPGZQOలో చదవండి.



ఆ సినిమా ఆమె జాతకాన్ని మార్చేసింది

ఒకే ఒక్క అవకాశం చాలా మంది జీవితాల్ని మార్చేస్తుంది. గ్లామర్ నటి త్రిప్తి దిమ్రి విషయంలో అదే జరిగింది. రణబీర్ కపూర్ నటించిన 'యానిమల్' సినిమాతో ఆమె ఒక్కసారిగా నేషనల్ క్రష్ అయిపోయింది. ఎవరీమె, వివరాలు ఏమిటి.. అని గూగుల్‌లో చాలా మంది సెర్చ్ చేశారు. ఆ సినిమా విడుదలైన దగ్గర నుంచి అభినందనలు, అవకాశాలు, ఫోన్లు, సందేశాలు....వాటితో క్షణం కూడా తీరిక చిక్కడం లేదు ఆమెకు. 'యానిమల్' చిత్రం నా జీవితాన్ని మార్చేసింది. ఎంతో మంది అభిమానంతో ఫోన్ చేసి అభినందిస్తున్నారు. వాళ్లు పంపే మెసేజ్‌లు చదువుతుంటే ఆనందంతో నాకు రాత్రిళ్లు నిద్ర కూడా పట్టడం లేదు. కొత్త అవకాశాలు కూడా వెదుక్కుంటూ వస్తున్నాయి. దర్శకుడు సందీప్‌రెడ్డికి ఎలా కృతజ్ఞతలు చెప్పాలో అర్థం కావడం లేదు' అని ఆమె ఓ ఆంగ్ల వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొంది. హీరో రణబీర్ అద్భుతమైన నటుడు అని ఈ సందర్భంగా త్రిప్తి చెప్పింది. 'యానిమల్'లో హీరోయిన్‌గా నటించిన రష్మిక గురించి మాట్లాడుతూ 'సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉంటే ఆ ఎనర్జీ వేరు. రష్మిక చాలా మంచి వ్యక్తి. తొలి రోజు షూటింగ్‌లో కలసినప్పుడు ఆమె నా దగ్గరకు వచ్చి, హగ్ చేసుకుని అభినందనలు తెలిపింది. సెట్‌లో రష్మిక ఎలా ఉంటుందో అని మొదట నేను భయపడ్డా కానీ ఆమె తన ప్రవర్తనతో నన్ను ఆకట్టుకొంది.

చిందెయ్యరా ఘోర హర

ధనుష్ నటించిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'కెప్టెన్ మిల్లర్'. అరుణ్ మాథేశ్వరన్ దర్శకుడు. సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మాతలు. కన్నడ అగ్రహీరో శివరాజ్‌కుమార్ ఇందులో కీలక పాత్ర పోషించారు. సంక్రాంతికి సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన మూడో పాటను చిత్రబృందం విడుదల చేశారు. 'ఘోర హర..' అంటూ సాగే పాటను రాకేందుమౌళి రాయగా, జీవి ప్రకాశ్‌కుమార్ స్వరాలందించారు. రాహుల్ సిప్లిగంజ్ హై ఎనర్జీతో ఆలపించారు. ఈ పాటను ధనుష, శివరాజ్‌కుమార్‌లపై చిత్రీకరించడం విశేషం. ఈ పాట ఈసినిమాకే హైలెట్‌గా నిలువనుందని, ధనుష్, శివరాజ్‌కుమార్ డాన్స్ నెక్స్ట్ లెవల్లో ఉంటుందని చిత్రబృందం చెబుతున్నారు. 1930-40 మధ్య జరిగే పిరియడ్ కథాంశంతో, భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రంలో ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. సందీప్‌కిషన్ ప్రత్యేపాత్ర పోషించారు. ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ నుని.



ల్యాండ్ మాఫియా వస్తోంది

ప్రణయనాథ హీరోగా నటిస్తూ, నిర్మించిన చిత్రం 'ల్యాండ్ మాఫియా'. మధుబాల కథానాయిక. బాబు వీఎస్ దర్శకుడు. మంగళవారం చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా ప్రణయనాథ మాట్లాడుతూ 'చిన్న సినిమాగా మొదలైన ఈ ప్రాజెక్ట్ పెద్ద చిత్రంగా మారింది. ఓ మంచి చిత్రాన్ని తీశాం. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'ప్రణయనాథ సహకారం వల్లే సినిమాను అనుకున్న విధంగా తీయగలిగాం. ఖర్చుకు వెనుకాడకుండా అన్ని హంగులతో నిర్మించాం. ప్రేక్షకులు మా చిత్రాన్ని ఆదరించాలి' అని కోరారు. సందేశంతో పాటు అన్ని రకాల వాణిజ్య హంగులు ఉన్న చిత్రమిదని మధుబాల తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రదీప్ చంద్ర. సినిమాటోగ్రఫీ: వెంకట్ జె. ఎడిటర్: కృష్ణ మండల.





నవరత్నాలు - నవమోసాలు పుస్తకాన్ని ఆవిష్కరణ చేస్తున్న కన్నా, కొమ్మాలపాటి

నవరత్నాలు-నవమోసాలు పుస్తకావిష్కరణ

● హామీలన్నీ నీటిమీద రాతలుగా మార్చిన సీఎం జగన్

పెదకూరపాడు, జనవరి 2: రాష్ట్ర చరిత్రలో హామీలన్నీ నీటిమీద రాతలుగా మార్చిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. మండలంలోని హౌస్సేన్ నగరంలో టీడీపీ నేత మాగులూరి కృష్ణారావు ఇంటి వద్ద జగన్ వైఫల్యాలపై నవరత్నాలు-నవమోసాలు పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ నవరత్నాల పేరుతో ప్రజలను నవవిధాలుగా మోసం చేశారన్నారు. హామీల అమలు కోసం ప్రశ్నిస్తే అణచివేతలు, అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. నవరత్నాల మేనిఫెస్టో, జగన్‌రెడ్డి పాదయాత్ర హామీల అమల్లో 85శాతం ఫెయిల్ అయ్యారని పేర్కొన్నారు. తాను 99.5శాతం హామీలు అమలు చేశానని ప్రతి సభలో జగన్‌రెడ్డి పదేపదే అబద్ధాల డబ్బా కొడుతున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పినదానికన్నా అదనంగా చేసిందని, అందుకే నేడు అన్నివర్గాల ప్రజలు చంద్రబాబుకు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అమలు చేసిన 120 సంక్షేమ పథకాలను జగన్‌రెడ్డి రద్దు చేశారని, పరిశ్రమలను పొరుగు రాష్ట్రాలకు తరిమివేశారని, రాజధానిని విధ్వంసం చేశారని, పోలవరాన్ని రివర్స్ చేయటం ద్వారా నదుల అనుసంధానానికి గండికొట్టి రాష్ట్రాన్ని కరువు రక్కసికి బలిపెట్టారన్నారు. కార్యక్రమంలో టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర ప్రతినిధి మాగులూరి హరిబాబు, ఎన్ఆర్ఐ మాగులూరి భానుప్రకాష్, జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ వరప్రసాదు, టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

బాజీచౌదరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

నకరికల్లు, జనవరి 2: మండలంలోని కుంకలగుంట గ్రామానికి చెందిన కసుమూరి బాజీచౌదరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ ఏ బాలకృష్ణ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలివి.. అచ్చంపేట మండలం ఓర్వకల్లు గ్రామానికి చెందిన డానీ, నవీన్, జాషువా, మరో యువకుడు కలసి డిసెంబరు 31వ తేదీన ఆదివారం జనసేన పార్టీ నిర్వహించే కార్యక్రమానికి డీజే పెట్టేందుకు వచ్చారు. కార్యక్రమం ముగిశాక వారు తెచ్చిన వాహనం పాడైంది. రాత్రి 11 గంటల సమయంలో వీరిలో ఒకరు వాటర్ బాటిల్ తీసుకొని బహిర్భూమికి వెళ్తుండగా బాజీచౌదరి పిలిచి ఎవర్రా మీరు?, ఎందుకు వచ్చారు?, ఎవరు మిమ్మల్ని పిలిపించింది? అని కొట్టి కులం పేరుతో దూషించినట్టు డానీ ఫిర్యాదు చేశాడు. ఆ సమయంలో మద్దాల సైదారావు అనే జనసేన నేత బాజీచౌదరితో మాట్లాడి అక్కడి నుంచి డానీ, మిగతా ముగ్గురు యువకులను విడిపించినట్టు తెలిపారు. సత్తెనపల్లి డీఎస్పీ బీ ఆదినారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూడు రాజధానులతో ప్రజల భవిష్యత్ నాశనం

● 1477వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

తుళ్లూరు, జనవరి 2: అన్నదాతను రోడ్డుపాలు చేసిన వైసీపీ ప్రభుత్వం మట్టి కరవాల్సిందేనని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు మంగళవారం నాటికి 1477వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి పలువురు రైతులు మాట్లాడారు. సీఎం జగన్‌రెడ్డి మూడు రాజధానుల పేరుతో ప్రజల భవిష్యత్‌ను నాశనం చేయాలని చూస్తున్నారన్నారు. హైకోర్టు కూడా అమరావతి అభివృద్ధిని కొనసాగించాలని తీర్పు చెప్పిందన్నారు. రాష్ట్ర రాజధానిని నిర్వీర్యం చేయాలని చూడటం దుర్మార్గపు పాలనే అవుతుందన్నారు. రైతులను బాధపెట్టిన పాలకులు అంతకంటే ఎక్కువ బాధపడతారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని ప్రకటించి అభివృద్ధిని కొనసాగించాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో నిరసనలు కొనసాగుతున్నాయి.



బిల్డ్ అమరావతి అంటూ మందడం ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న రైతులు

దుర్మార్గ పాలకులు దోపిడీ చట్టాలే తెస్తారు

● నాదెండ్ల మనోహర్, ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి క్రైం, జనవరి 2: దుర్మార్గపు పాలకులు తమకు అనుకూలమైన దోపిడీ చట్టాలనే తెస్తారు.. ఈ ప్రభుత్వ పెద్దలు గత నాలుగున్నర సంవత్సరాలుగా సాగించిన భూకబ్జాలు, భూదోపిడీలను చట్టబద్ధం చేసుకోవడానికి 512 జీవో తెచ్చారని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు ఆరోపించారు. మంగళవారం తెనాలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు వీరు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మాట్లాడుతూ న్యాయ నిపుణులను, రాజకీయ పార్టీలను సంప్రదించకుండా ఏకపక్షంగా 27/2023 ల్యాండ్ టైటలింగ్ చట్టాన్ని ఈ ప్రభుత్వం తెచ్చిందన్నారు. దీనివలన సామాన్యుడి ఆస్తులకు రక్షణ కరువవుతుందన్నారు. ఈ చట్ట ప్రకారం ఆస్తులకు సంబంధించి వివాదాలు ఏర్పడితే అధికారులే ఇష్టానుసారం నిర్ణయం తీసుకుంటారన్నారు. వాస్తవానికి రాష్ట్రంలో భూ వివాదాలు పరిష్కరించడానికి 563 సివిల్ కోర్టులు ఉన్నాయి. పటిష్టమైన న్యాయవ్యవస్థ ఉందన్నారు. ఇది కాదని ప్రభుత్వం ఈ దుర్మార్గపు చట్టాన్ని తెచ్చిందన్నారు. రాబోయే జనసేన, తెలుగుదేశం ప్రభుత్వం జీవో 512ను రద్దు చేసి మెరుగైన పాలన అందిస్తుందని నాదెండ్ల తెలిపారు. మాజీ మంత్రి ఆలపాటి మాట్లాడుతూ ఐదు కోట్ల ఆంధ్రులు త్వరలోనే ఈ ప్రభుత్వాన్ని మార్చడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. న్యాయవ్యవస్థను కించపరిచేలా జీవో 512ను ఈ ప్రభుత్వం తెచ్చిందన్నారు. గతంలో అనేక తప్పుడు జీవోలు తెచ్చినప్పుడు సుప్రీం కోర్టు, హైకోర్టులు పలుమార్లు ఈ ప్రభుత్వానికి అక్షింతలు వేసినా సిగ్గు లేకుండా మళ్ళీ దోపిడీ జీవోలను తీసుకువస్తుందన్నారు. జగన్ పరిపాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మందలపు వేణుగోపాలరావు, హరిదాసు గౌరీశంకర్, న్యాయవాదులు పాల్గొన్నారు.



నిరసనకు మద్దతు తెలుపుతున్న నాదెండ్ల, ఆలపాటి

చినికిచినికి గాలివానగా మారిన ఘర్షణ

● ఆ రెండు గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు

కొల్లూరు, జనవరి 2: నూతన సంవత్సరం సందర్భంగా 31వ తేదీ రాత్రి వేడుకల్లో రెండు గ్రామాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కిష్కిందపాలెంలో యువత గత నెల 31వ తేదీ రాత్రి డీజే వాయిద్యాలతో ట్రాక్టర్‌పై తోకలవానిపాలెం గ్రామం వద్దకు వెళ్లగా అక్కడ కొంతమంది గ్రామస్తులు వేరే పాటలు పెట్టుకోవాలని సూచించడంతో ఇరు గ్రామాల యువకుల మధ్య ఘర్షణకు దారితీసింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాజ్యలక్ష్మి గ్రామానికి చేరుకుని కిష్కిందపాలెంకు చెందిన యువకులను హెచ్చరించి డీజే స్వాధీనపరచుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ నెల 1వ తేదీన ఇరు గ్రామాల పెద్దలు పరస్పరం చర్చించుకుని సమస్యను పరిష్కరించుకుంటామని చెప్పడంతో ఎస్ఐ డీజే వాయిద్యాలను వారికి అప్పగించారు. వాటిని తీసుకుని కిష్కిందపాలెం గ్రామానికి చెందిన యువకులు డీజేలను మాత్రం వెల్లటూరు మీదుగా కిష్కిందపాలెం పంపి తాము మాత్రం ద్విచక్రవాహనాలపై తోకలవానిపాలెం మీదుగా తమ గ్రామానికి వెళుతూ ఆ గ్రామంలో ద్విచక్రవాహనాల రణగొణ ధ్వనులతో పాటు అక్కడ బాణాసంచా పేల్చారు. ఆ గ్రామస్తులు అడ్డుచెప్పడంతో అంబేద్కర్ విగ్రహంపై రాళ్లు రువ్వినట్లుగా తోకలవానిపాలెం గ్రామస్తులు ఆరోపిస్తూ ఓ ఇద్దరు కిష్కిందపాలెం వెళ్లి అక్కడివారితో చర్చిస్తుండగా ఓ యువకుడు గొడవపడ్డాడు. అది చిలికిచిలికి గాలివానగా మారి ఇరు గ్రామాల మధ్య ఘర్షణకు దారితీసింది. గొడవ పడిన యువకుడు తన గ్రామానికి చేరుకుని గ్రామంలోని వారందరికి తనపై దాడి చేశారంటూ చెప్పి సుమారు 300మందితో కిష్కిందపాలెం ఎస్‌సి కాలనీపై దాడికి బయలుదేరాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ రాజ్యలక్ష్మి తన సిబ్బందితో అక్కడకు చేరుకుని కట్టడిచేసే ప్రయత్నం చేశారు. అయినా కర్రలు, రాళ్లతో దాడి చేసుకోవడంతో ఇరు గ్రామాలకు చెందిన నలుగురు యువకులు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు పంపి భట్టిప్రోలు, వేమూరు, అమృతలూరు, రేపల్లెల నుంచి పోలీసు బలగాలను రప్పించి ఇరు గ్రామాల్లో పికెట్లు ఏర్పాటుచేశారు. కిష్కిందపాలెం గ్రామస్తులు మాత్రం ఘర్షణకు ఎస్ఐ కారణమంటూ ఆరోపణలు చేస్తున్నారు. దీనిపై ఎస్ఐ వివరణ కోరగా ఇరువర్గాలను తాము అడ్డుకుని నిలువరించడం జరిగిందని, లేనిపక్షంలో పరిస్థితి చేయిదాటేదని, తనపై ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. ఇరు గ్రామాల పెద్దలతో చర్చలు జరిపి శాంతియుత వాతావరణం నెలకొనే వరకు పికెటింగ్ కొనసాగిస్తామని ఎస్ఐ తెలిపారు.



తోకలవానిపాలెం రోడ్లుపై తిరగవద్దంటూ గ్రామస్తులను హెచ్చరిస్తున్న పోలీసులు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

యడ్లపాడు, జనవరి 2: పదహారో నంబరు జాతీయరహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యడ్లపాడు ఎస్సీ కాలనీ(పైపల్లె)కి చెందిన కోడిరెక్క శామ్యేలు(50) పాతసామాన్లు ఏరుకుంటూ ఉంటాడు. సోమవారం రాత్రి స్థానిక పిల్లి కొండ సమీపంలో రహదారిని దాటుతుండగా గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీకొట్టింది. దీనితో శామ్యేలు అక్కడికక్కడే మృతిచెందాడు. రోడ్డుపై పడి ఉన్న మృతదేహంపై నుంచి గుర్తు తెలియని మరో రెండు వాహనాలు వెళ్ళడంతో శరీరం గుర్తుపట్టలేనంతగా ఛిద్రమైంది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ముగ్గురికి గాయాలు

రాజుపాలెం, జనవరి 2: అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై మండల పరిధిలోని దేవరంపాడు గ్రామ బస్టాండ్ సెంటర్లో రోడ్డు ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలైన సంఘటన మంగళవారం జరిగింది. దేవరంపాడు గ్రామానికి చెందిన పిల్లల సరస్వతి(68), రుసుము సామ్రాజ్యం, కుంభ ఆంజయ్యలు వ్యక్తిగత పనులపై రాజుపాలెం వచ్చి తిరిగి వెళ్తున్నారు. మార్గమధ్యంలోని కొండమోడు జంక్షన్‌లో దిగి, ఆటో కోసం ఎదురుచూస్తున్నారు. గజేంద్ర హనుమంతరావు దేవరంపాడు వెళ్లేందుకు పిడుగురాళ్ల నుండి ఆటోతో వచ్చాడు. సరస్వతి, సామ్రాజ్యం, అంజయ్యలను ఎక్కించుకుని బయల్దేరాడు. ఆటో దేవరంపాడు బస్టాండ్ దగ్గరకు వచ్చేసరికే నరసరావుపేట నుండి పిడుగురాళ్ల వైపు వెళ్తున కారు అతి వేగంతో వచ్చి ఢీకొట్టింది. ఈ సంఘటనలో నలుగురికి గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం హస్పటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సరస్వతి మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తహసీల్దార్, వీఆర్వోకు షోకాజ్ నోటీసులు

● ఆర్డీవో శ్రీకర్

ప్రత్తిపాడు, జనవరి 2: కులాల వారీగా ఓట్ల లెక్కింపు విషయంలో వీఆర్వోలతో సమావేశం పెట్టడంపై కాకుమాను తహసీల్దార్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు గుంటూరు ఆర్డీవో, ప్రత్తిపాడు ఎన్నికల అధికారి శ్రీకర్ తెలిపారు. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు శేషు నియోజకవర్గంలో కులం ఓట్లు రెవెన్యూ అధికారులు లెక్కించడం ఏమిటంటూ ఆర్డీవోను ప్రశ్నించారు. అందుకు ఆర్డీవో అలాంటివి లేవంటూ సమర్థించే ప్రయత్నం చేశారు. కాకుమాను తహసీల్దార్ ప్రసాదరావు తాను అలా చేప్పలేదంటూ బుకాయించే ప్రయత్నం చేశారు. శేషు మాట్లాడుతూ తాను కాల్ చేసినప్పుడు కులం ఓట్ల లెక్కింపు ఆపేస్తున్నాను.. ఇక జరగదు అంటూ ఎందుకు చెప్పారని ప్రశ్నించారు. తన వద్ద మొత్తం ప్రూఫ్‌లు ఉన్నాయన్నారు. మెసేజ్ ఎందుకు పెట్టాల్సివచ్చిందో చెప్పాలంటూ శేషు ప్రశ్నించారు. దీంతో ఆర్డీవో శ్రీకర్ మాట్లాడుతూ కాకుమాను తహసీల్దార్ ప్రసాదరావుతో పాటు వీఆర్వోకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. ఇక నుండి ఎలాంటి పొరబాట్లు జరగవన్నారు.



ఆర్డీవో శ్రీకర్‌ను ప్రశ్నిస్తున్న టీడీపీ నాయకుడు శేషు

అందరి సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం

మాజీ ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, జనవరి 2: ఐదేళ్ల రాక్షస పాలనకు తెరదించి టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రజాప్రభుత్వం మరో మూడు నెలల తరువాత రాబోతోందని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలు, పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అందరి సంక్షేమమే ధ్యేయంగా చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు పోరాటం చేస్తున్నారని, పంటలకు గిట్టుబాటు ధర లేక, నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో ప్రతి ఒక్కరు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం మొండివైఖరితో ముందుకే అన్నట్టుగా వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్రంలో అంగన్‌వాడీలు, పారిశుధ్య కార్మికులు, సమగ్రశిక్ష సిబ్బంది సమ్మె చేస్తున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోగా వారు చేస్తున్న సమ్మెకు అడ్డంకులు సృష్టిస్తుందన్నారు. సమస్యలను పరిష్కరించే నాథుడే లేక రాష్ట్రంలో లక్షలాది మంది అంగన్‌వాడీ, పారిశుధ్య కార్మికులు అల్లాడిపోతున్నారన్నారు. రాబోయే మూడు నెలలు చాలా కీలకమని, ప్రతి ఒక్కరు ప్రజాప్రభుత్వ ఏర్పాటు దిశగా పనిచేయాలని యరపతినేని కోరారు. అనంతరం పాత్రికేయులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, కనిగిరి శ్రీను, వడ్డవల్లి సాంబశివరావు, సయ్యద్ అమీర్‌అలీ, వల్లెపు రామకృష్ణ, వీరాస్వామి, బడిగుంచల వెంకటేశ్వర్లు, కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాశింసైదా, పసుపులేటి నరసింహారావు, పిల్లి చెన్నారావు, పణితి రవి, చల్లగుండ్ల శ్రీను, ఎల్‌వీ ఆర్, దేవళ్ల రాంబాబు, నెకరికంటి శివ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ నాయకులు

నేడు అధినేత చంద్రబాబు సమక్షంలో చేరనున్న కర్లపాలెం జడ్పీటీసీ మెంబరు, ఇతర నాయకులు



పిట్ల వేణుగోపాలరెడ్డి

బాపట్ల, జనవరి 2: బాపట్ల నియోజకవర్గంలో వైసీపీలో అంతర్గత కుమ్ములాట ఎక్కువైంది. అసమ్మతి నేతలు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. ఇప్పటికే కర్లపాలెం మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్‌బాషా వైసీపీ శ్రేణులతో కలిసి నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ నాయకత్వంలో టీడీపీలో చేరారు. ప్రస్తుతం వైసీపీకి పెట్టని కోటగా ఉన్న ఎం.వి.రాజుపాలెం గ్రామానికి చెందిన వైసీపీ జడ్పీటీసీ మెంబరు పిట్ల వేణుగోపాలరెడ్డి 75మంది ముఖ్య అను చరులతో కలిసి బుధవారం మంగళగిరిలో పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేశారు. కొద్ది రోజులుగా ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అజ్ఞాతంలోకి వెళ్ళినట్లు తెలిసింది. నూతన సంవత్సరం రోజు ఎమ్మెల్యే కోన రఘుపతికి శుభాకాక్షలు చెప్పేందుకు కూడా ఆయన బయటకు రాలేదు. వేణుగోపాలరెడ్డి తన అనుచరులతో టీడీపీలో చేరుతున్నట్లు టీడీపీ నాయకులు పేర్కొంటున్నారు. అదేవిధంగా కర్లపాలెం మండలం యారంవారిపాలెం గ్రామానికి చెందిన యారం ప్రసాద్ మరో 12మంది వైసీపీ శ్రేణులతో కలిసి టీడీపీలో చేరుతున్నారు. పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం గ్రామానికి చెందిన నరసింహమూర్తిరాజు 10మందితో కలిసి టీడీపీలో చేరుతున్నారు. ఈ విధంగా వైసీపీ శ్రేణులు ఎన్నికల సమీపిస్తున్న సమయంలో టీడీపీ వైపు రావ టం నియోజకవర్గ రాజకీయాలలో చర్చనీయాంశమైంది. వైసీపీలో తమకు సముచిత స్థానం లేదని, కనీసం చిన్నపాటి పనులు కూడా చేయించుకోలేకపోతున్నామని వారు పేర్కొంటున్నారు. అదేవిధంగా పిట్టలవానిపాలెం వైసీపీ, జడ్పీటీసీ మెంబరు గోవతోటి సురేఖ తన అనుచరులతో కలిసి ఇప్పటికే ఎమ్మెల్యే కోన రఘుపతికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. రానున్న ఎన్నికలలో కోన రఘుపతికి టిక్కెట్టు కేటాయించరాదని బహిరంగంగా పేర్కొంటున్నారు. కర్లపాలెం వైసీపీ ఎంపీపీ యారం వనజ కూడా ఎమ్మెల్యే కోనకు వ్యతిరేకంగా ఉన్నారు. ఈవిధంగా వైసీపీలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు తమకు సముచిత స్థానం లేదనే కారణంతో టీడీపీ వైపు చూస్తున్నారు. కాగా ఈ విషయమై టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మను వివరణ కోరగా బుధవారం 3గంటలకు చంద్రబాబునాయుడు సమక్షంలో 100మంది వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు.

కులంపేరుతో దూషించిన వైసీపీ నేతపై ఫిర్యాదు



బాధిత మహిళతో కలిసి పట్టణ పోలీసుస్టేషన్‌లో సీఐ శ్రీనివాసులకు ఫిర్యాదు చేస్తున్న డాక్టర్ జి.చార్వాక, శీలం రోజన్‌బాబు

బాపట్ల, జనవరి 2 : పట్టణంలోని రాజీవ్ గాంధీకాలనీ 3వ వార్డు ఆర్‌వోబీ పక్కనే నివాసం ఉంటున్న తగరపు సువర్ణను కులం పేరుతో దూషించిన కాంట్రాక్టర్, వైసీపీ నాయకుడు కొత్రా కొండలుపై చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే ఎస్సీ సామాజికవర్గానికి చెందిన సువర్ణ కుటుంబం 70 సంవత్సరాలుగా ఆ ప్రాంతంలో టీకొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తున్నది. అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన స్థలాలలో ఉంటున్నామని ఆమె వివరించింది. మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి హయాంలో ఆర్‌వోబీ నిర్మాణానికి కొంత భూమిని తీసుకోవటం జరిగిందన్నారు. ఇటీవల రోడ్డు విస్తరణకు కొంత భూమిని తీసుకోవటం జరిగిందన్నారు. దీనిని ఆసరాగా తీసుకొని కొత్రా కొండలు పక్కనే ఉన్న ఆయన స్థలానికి ఉపయోగపడేవిధంగా తమను ఖాళీ చేయించి రోడ్డు వేయటం జరిగిందన్నారు. ఇదేమిటని అడిగితే కులం పేరుతో దూషించి చంపుతామని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నది. తగిన న్యాయం చేయాలని కోరుతూ అంటరానితన నిర్మూలన పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక, మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజన్ బాబు, గిరిజన హక్కుల రాష్ట్రనాయకుడు కొండారెడ్డి వెంకటేశ్వర్లు, దళిత మహిళా నాయకురాలు దాసరి లక్ష్మీ, మంచాల ఆనంద్, బాధితులు టీడీపీ, కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి సీఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.85 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	102, 110, 122
చికెన్ విత్ స్కిన్	196.00
చికెన్ స్కిన్ లెస్	206.00

సంక్రాంతి రైల్వే స్పెషల్స్ వచ్చేస్తున్నాయి...

గుంటూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ సెలవుల్లో ప్రయాణీకుల కోసం రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే విశాఖపట్టణం-కర్నూలు సిటీ-విశాఖపట్టణం, శ్రీకాకుళం-వికారబాద్-శ్రీకాకుళం స్పెషల్స్‌ని ప్రకటించిన రైల్వేశాఖ తాజాగా మరికొన్నింటిని గుంటూరు మీదగా నడపనున్నట్లు పేర్కొన్నది. ఈ నెల 7, 14(ఆదివారం) తేదీల్లో నెం.07089 సికింద్రాబాద్-బరంపురం ప్రత్యేక రైలు రాత్రి 7.45కి బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 11.15కి బరంపురం చేరుకొంటుంది. నెం.07090 బరంపురం -వికారబాద్ రైలు ఈ నెల 8, 15(సోమవారం) తేదీల్లో మధ్యాహ్నం 12.30కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి మీదగా మరుసటి రోజు ఉదయం 8.30కి వికారబాద్ చేరుకొంటుంది. నెం.07272 కాకినాడ టౌన్-సికింద్రాబాద్ రైలు ఈ నెల 13న రాత్రి 8.10కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదగా మరుసటి రోజు ఉదయం 8.30కి సికింద్రాబాద్ చేరుకొంటుంది. నెం.07093 సికింద్రాబాద్-బరంపురం రైలు ఈ నెల 8, 15 తేదీల్లో(సోమవారం) రాత్రి 7.45కి బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 11.15కి బరంపురం చేరుకొంటుంది. నెం.07094 ఈ నెల 9, 16 తేదీల్లో బరంపుం-సికింద్రాబాద్ రైలు మధ్యాహ్నం 12.30కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి మీదగా మరుసటి రోజు ఉదయం 6 గంటలకు సికింద్రాబాద్ చేరుకొంటుంది.

తెనాలి, బాపట్ల మీదగా...

నెం.02764 సికింద్రాబాద్-తిరుపతి రైలు ఈ నెల 10, 17 తేదీల్లో సాయంత్రం 6.40కి బయలుదేరి తెనాలి, బాపట్ల, చీరాల మీదగా మరుసటి రోజు ఉదయం 6.45కి తిరుపతి చేరుకొంటుంది. నెం.02763 తిరుపతి - సికింద్రాబాద్ రైలు ఈ నెల 11, 18 తేదీల్లో సాయంత్రం 5.15కి బయలుదేరి చీరాల, బాపట్ల, తెనాలి మీదగా మరుసటి రోజు ఉదయం 5.55కి సికింద్రాబాద్ చేరుకొంటుందని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ తెలిపారు.

గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 49,585 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 47,139 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. యార్డు ఆవరణలో 33,363 టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తెల్లకాయలు	5000	13500
334	9500	21500	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	11500	18000	334	14000	20500
273	14500	16000	నెంబరు.5	--	--
341	10000	20000	273	--	--
4884	--	--	341	12000	18500
సూపర్ 10	--	--	4884	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9000	23000	తేజ	13200	23200
బ్యాడిగి	10000	23000	బ్యాడిగి	13500	20000
దేవనూరుడీలక్స్	10000	18000	తెల్లకాయలు	6500	12500

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం : వేగేశన


మహిళలకు చీరలు, సంచులు అందజేస్తున్న వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జనవరి 2 : అభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. ఇంటింటికి తెలుగుదేశం, మీమాటే-నా బాట, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలను పట్టణంలోని 12వ వార్డు, మండలంలోని ఈతేరు గ్రామాలలో మంగళవారం ఆయన నిర్వహించారు. పార్టీశ్రేణులతో కలిసి ఇంటింటి కెళ్ళి కరపత్రాలు పంచుతూ మహిళలకు చీరలు, సంచులు అందజేశారు. నూతన సంవత్సరంలో తెలుగుదేశం, జనసేన సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడుతుందని వినూత్న పథకాలతో ప్రజలకు మెరుగైన సేవలందించటం జరుగుతుందన్నారు. ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల సాంబశివరావు, మాజీ సర్పంచ్ ఇనగంటి గాంధీ, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి హైమావతి, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ, కూచిపూడి ఝాన్సీరాణి, రజనీ, దగ్గుమల్లి రాణి, షేక్.నజ్మా, ఇందు, మస్తాన్‌బి, పద్మ, పల్లంజీవన్, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు అందజేత

బాపట్ల,జనవరి 2 : ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. బాపట్ల మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసిన అనంతరం కమిషనర్ ఎ.భానుప్రతాప్‌కు సమ్మె నోటీసును అందజేశారు. పాదయాత్రలో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పారిశుద్య కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు దళాయి వెంకటసుబ్బారావు, కార్యదర్శి పొట్లూరి కామాక్షి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి ఎస్.సత్యవతి, కోశాధికారి దళాయి దుర్గారావు, డివి సుబ్బారావు, కె.కుమారి, బి.ఎలిజబెత్ రాణి, సి.హెచ్.వెంకటలక్ష్మి, పి.విజయలక్ష్మి, ఎన్.సత్యవతి, పి.సాల్మన్, డి.దుర్గమ్మ, డి.గోపమ్మ, ఎస్.దుర్గాదేవి, వై.లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

చెత్తకుప్పలు పూర్తి స్థాయిలో తొలగించండి : కమిషనర్


శానిటరీ, సచివాలయ సిబ్బందితో చర్చిస్తున్న కమిషనర్ భానుప్రతాప్

బాపట్ల, జనవరి 2 : పట్టణంలోని ప్రధాన కూడళ్ళల్లో చెత్తకుప్పలు పూర్తి స్థాయిలో తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్ శానిటరి సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు సమ్మె నోటీసు ఇవ్వటంతో పర్మినెంట్ కార్మికులు, శానిటరీ సిబ్బందితో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొత్తం 46మంది శానిటేషన్ పనులు చేయాలని చెప్పారు. వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి వలంటీర్ వెళ్ళి తమ ఇంట్లో నుంచి వచ్చే చెత్తను స్టాక్‌పాయింట్‌లలో వేసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ విషయంలో శానిటరి సెక్రటరీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. మొత్తం 157మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమ్మెలోకి వెళతున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో ఏఈ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

పిట్టలవానిపాలెం, జనవరి 2 : కొత్తపాలెం గ్రామపంచాయతీలోని రక్షణనగర్ లో ఎస్తేరు వాణి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగేశన నరేంద్రవర్మ ఆదేశాల మేరకు పిట్టలవానిపాలెం మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, టీడీపీ నాయకులతో పరామర్శించారు. వారి కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపాలెంగ్రామ టీడీపీ అధ్యక్షులు స్వామిరెడ్డి, మండల, గ్రామ తెలుగుదేశంపార్టీనాయకులు కనుమూరి సాంబమూర్తిరాజు, మురళీరాజు, సాంబిరెడ్డి, నాని, గోపి, తెలుగు మహిళలు రాజ్యలక్ష్మీ, టీడీపీ నాయకులు లక్ష్మంరాజు వెంకటపతిరాజు, కనుమూరి సాంబమూర్తిరాజు, బి.నరసరాజు, పార్టీకార్యకర్తలు పాల్గొన్నారు

ఉద్యోగవిరమణ చేసిన సైనికునికి సన్మానం

కర్లపాలెం, జనవరి 2 : మండలంలోని దుండివారిపాలెం గ్రామానికి చెందిన వారి రవీంద్రరెడ్డి 19 సంవత్సరాలు సైనికునిగా దేశ రక్షణలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి ఉద్యోగ విరమణ అనంతరం స్వగ్రామానికి రాగా గ్రామంలోని యువకులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. గ్రామంలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై రవీంద్రరెడ్డి దంపతులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ చీఫ్ మార్షల్ దుండి ఏడుకొండలురెడ్డి, మునిరెడ్డి, సర్పంచ్ పులుగు గోవిందమ్మ పాల్గొన్నారు.

బెదిరిస్తే బెదిరేదేలేదు.. సమ్మెను కొనసాగిస్తాం

● దున్నపోతుల వద్ద వినతిపత్రం ఉంచిన అంగన్‌వాడీలు

బాపట్ల,జనవరి 2 : బెదిరిస్తే బెదిరేదేలేదని సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని బాపట్ల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు అన్నారు. గత 22 రోజులుగా సమస్యల పరిష్కారం కోరుతూ చేస్తున్నసమ్మెలో భాగంగా మంగళవారం ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. తెలంగాణ కన్నా ఎక్కువ వేతనం ఇవ్వాలని పాదయాత్రలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రదర్శనగా ఉప్పరపాలెం వెళ్ళి అక్కడ దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షురాలు వెలగా శైలశ్రీ మాట్లాడుతూ కనీస వేతనం, గ్రాడ్యుటి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సీతామహలక్ష్మీ, హేమమాలిని, భారతి, వసంత, గీత, పద్మ, సీఐటీయూ నాయకులు సి.హెచ్ మజుందార్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు, జనవరి 2 : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 22వ రోజుకు చేరింది. దున్నపోతు వద్ద మంగళవారం వినతిపత్రం ఉంచి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంవీ చిష్టీ అంగన్‌వాడీల సమ్మెకు సంఘీభావంగా తెలియజేస్తూ న్యాయమైన సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటాన్ని ఉధృతం చేయాలని ఆవాజ్ తోడుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు జి. సుధాకర్, ఆయా ప్రజా సంఘాల నాయకులు వేముపల్లి వెంకట్రామయ్య, మురుగుడు సత్యనారాయణ, పి.మనోజ్, సెక్టార్ లీడర్లు రమాదేవి, గృహలక్ష్మీ, సూర్యలక్ష్మీ పాల్గొన్నారు.

● కొల్లూరు, జనవరి 2 : కొల్లూరులోని దీక్ష శిబిరం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు దున్నపోతు వద్ద తమ న్యాయమైన కోర్కెల వినతిపత్రాన్ని అందజేశారు. సీఐటీయూ నాయకులు బొనిగల సుబ్బారావు మాట్లాడుతూ అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం దున్నపోతు మీద వర్షం పడినట్లుగా వ్యవహరిస్తుందని విమర్శించారు. బుధవారం నుంచి సమ్మెను ఉధృతం చేయనున్నట్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యకర్తలు ఆదిలక్ష్మి, వనజ, నగరాజకుమారి, సౌభాగ్యలక్ష్మి, భాగ్యం, కాశీ, బాల, అరుణ, అపర్ణ, సత్యవతి పాల్గొన్నారు.

● వేమూరు, జనవరి 3 : తమ కోర్కెల సాధనపై రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి అవలంబించడంపై అంగన్‌వాడీలు తీవ్ర నిరసన వ్యక్తపరుస్తూ వేమూరులో దున్నపోతు వద్ద వినతిపత్రం ఉంచారు. సీఐటీయు నాయకులు అగస్టీన్ మాట్లాడుతూ అంగన్‌వాడీల పట్ల బాధ్యతారాహిత్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆరోపించారు. బుధవారం నుండి సమ్మె ఉధృతంలో భాగంగా చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పద్మావతి, అన్నపూర్ణ, అమల, బుల్లెమ్మాయి, అనసూయ దుర్గ, సునీత పాల్గొన్నారు.


వేమూరులో దున్నపోతు వద్ద వినతిపత్రం ఉంచుతున్న అంగన్‌వాడీలు

● చుండూరు, జనవరి 2 : చుండూరులో అంగన్‌వాడీలు దున్నపోతు వద్ద వినతిపత్రం ఉంచి నిరసన తెలిపారు. బెదిరించి ఒత్తిడి చేసి నిరసనలు విరమింపజేయాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా ఈ ప్రభుత్వానికి తలవంచమని అంగన్‌వాడీలు తెలిపారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు నిరసన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● రేపల్లె, జనవరి 2 : అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించటంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ జీ.నాగమల్లేశ్వరమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలు తాలూకా సెంటర్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేస్తున్న దీక్ష 22వ రోజుకు చేరాయి. నెహ్రూ విగ్రహానికి గులాబి పువ్వు ఇచ్చి నిరసన తెలిపారు. కార్యక్రమంలో వై.కనకదుర్గ, అరుణశ్రీ, అనూష, తులసి, శ్రీలేఖ పాల్గొన్నారు.


రేపల్లెలో దున్నపోతు వద్ద వినతిపత్రం ఉంచి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల సేవలు ఇతరులకు అప్పగిస్తే ఊరుకునేది లేదని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ అన్నారు. దున్నపోతు వద్ద వినతిపత్రాన్ని అందించి అంగన్‌వాడీలు సీఐటీయూ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 22 రోజులుగా తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నా కుంటిసాకులు చెప్పటం ఎంత వరకు సమంజసం అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, ఆదర్శవేదిక కన్వీనర్ వై.కిషోర్, నాయకులు కె.రమేష్, బి.ఆగస్టీన్, వై.మేరీమణి, బి.జ్యోతి, ఎన్.కృష్ణకుమరి, నిర్మలా జ్యోతి, శివలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ దీక్షకు మద్దతుగా ఇటీవల ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ సంఘీభావం తెలపగా అంగన్‌వాడీలు ఎమ్మెల్యే అనగానిని అంగన్‌వాడీలు కింద కూర్చోవాల్సి వస్తుందని కొంత మంది పెద్దవారు క్రింద కూర్చోలేక ఇబ్బందులు గురౌవుతున్నారని తెలిపారు. స్పందించిన అనగాని సత్యప్రసాద్ మంగళవారం 192కుర్చీలు సమకూర్చగా టీడీపీ పట్టణాధ్యక్షులు గోగినేని పట్టాభిరామారావు, టీడీపీ నాయకులు జీవీ నాగేశ్వరరావు, వడ్డే లక్ష్మీజీ, సోములు, వాకా వెంకటేశ్వరరావు, యరగళ్ళ దర్మతేజ వారికి అందించారు.

5లోపు విధులకు హాజరుకాకపోతే చర్యలు :కలెక్టర్

బాపట్ల, జనవరి 2 : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ 5వ తేదీ లోగా విధులకు హాజరుకావాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒకవేళ సమ్మె విరమింపజేయని యెడల ప్రభుత్వ నియమనిబంధనలు అనుసరించి శాఖా పరమైన చర్య తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే ప్రభుత్వం చాలా డిమాండ్లను పరిష్కరించిందని గుర్తుంచుకోవాలన్నారు. సమ్మె వల్ల బాలింతలు, గర్భిణీస్త్రీలు, పసిపిల్లలు పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సహృదయంతో అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మీ న్యాయమైన కోర్కెలు పరిష్కరించటానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య


విజయ్‌కుమార్ (ఫైల్)

కర్లపాలెం, జనవరి 2 : కర్లపాలెం పంచాయతీ పరిధిలోని రాజులపాలేనికి చెందిన ఓలేటి విజయ్ కుమార్ వ్యక్తిగత కారణాల వలన సోమవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని చనిపోయాడని ఎఎస్సై సాంబశివరావు తెలిపారు. అతని భార్య ఓలేటి శ్రావణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

నేడు పెదపులివర్రులో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

భట్టిప్రోలు, జనవరి 2 : మండలంలోని పెదపులివర్రు గ్రామ టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివంగత నందమూరి తారకరామారావు విగ్రహావిష్కరణ బుధవారం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రేపల్లె, పర్చూరు ఎమ్మెల్యేలు అనగాని సత్యప్రసాద్, ఏలూరి సాంబశివరావు, మాజీ మంత్రులు నక్కా ఆనందబాబు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకట సుబ్బయ్య, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్ పాల్గొంటారన్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు ఆరోగ్య సురక్షతో లబ్ధి

● రాష్ట్ర వైద్య కుటుంబ ఆరోగ్య శాఖ కమిషనర్ నివాస్


మందులను పరిశీలించి సూచనలు చేస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ కమిషనర్ నివాస్

కర్లపాలెం, జనవరి 2 : రాష్ట్రవ్యాప్తంగా దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి జగనన్న ఆరోగ్యసురక్ష ద్వారా 2 లక్షల 60 వేల మందికి లబ్ధి చేకూరుందని రాష్ట్ర వైద్య కుటుంబ ఆరోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్ అన్నారు. మండలంలోని పాతనందాయపాలెం సచివాలయం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్యసురక్ష రెండోవ విడత కార్యక్రమం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డీఎంహెచ్‌వో విజయమ్మ అధ్యక్షత వహించారు. కమిషనర్ జె.నివాస్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ప్రతినెల సచివాలయాల వద్ద రెండుసార్లు నిర్వహించే ఫ్యామిలి డాక్టర్ ప్రోగ్రామ్‌లో ప్రజలందరూ పాల్గొని తమకు ఉన్న ఆరోగ్య సమస్యలను చూయించుకోవాలని సూచించారు. అనంతరం రోగులకు మందులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఇమ్యూనైజేషన్ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవో రవీందర్, ఎంపీడీవో దాసరి రాంబాబు, ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు, గ్రామసర్పంచ్ కావూరి చిట్టెమ్మ, ప్రాథమిక ఆరోగ్యకేంద్ర డాక్టర్‌లు మంచికలపాటి గోపినాద్, సుభానాబేగం, ఈవోపీఆర్డీ ఏలీషాబాబు, కార్యదర్శి పద్మావతి, స్టేట్ క్వాలిటీకంట్రోలర్ అధికారి డాక్టర్ రామారావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయం

● నియోజకవర్గ బీసీ సంఘ కో ఆర్డినేటర్ రమేష్‌బాబు

వేమూరు, జనవరి 2 : బీసీల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని, మరి ముఖ్యంగా నాయీబ్రాహ్మణులకు చంద్రబాబునాయుడు ఎంతో మేలు చేశారని వేమూరు నియోజకవర్గ టీడీపీ బీసీ సంఘం కో ఆర్డినేటర్ తులం రమేష్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని కుచ్చెళ్ళపాడు గ్రామంలో రాష్ట్ర నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ మాజీ ఛైర్మన్ గుంటుపల్లి నాగేశ్వరరావు, సాధికార సమితి అధ్యక్షులు సాయిబాబు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ బీసీ భరోసా బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మ్యానిఫెస్టోలో వివరించిన బీసీ భరోసా అంశాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అవ్వాలనే ఆకాంక్షతో నాయిబ్రాహ్మణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు తులం సాంబశివరావు, అన్నవరపు రమణ, అన్నవరపు శ్రీనివాసరావు, వెంకటరావు, శ్రీను, చిన్నం సత్యనారాయణ, తులం శ్రీనివాసరావు, పాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంగళగిరిలో పంచాయతీ సదస్సు

వేమూరు, జనవరి 2 : తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు పంచాయతీలను కాపాడుకుందాం అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు మంగళగిరి తెలుగుదేశం పార్టీ కార్యాలయం సమీపంలోని సీకే కన్వెన్షన్ హాల్లో పంచాయితీ సదస్సు నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు తెలిపారు. ఈ సదస్సుకు నియోజకవర్గంలోని తాజా, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, పంచాయితీ వార్డుల సభ్యులు, హాజరై సదస్సును జయప్రదం చేయాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సదస్సుకు హాజరవుతారన్నారు.

జీతాలు రాక విధుల నుంచి తప్పుకున్న పాఠశాల సెక్యూరిటీ సిబ్బంది

చుండూరు, జనవరి 2 : మండలంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పాఠశాలకు చెందిన ఆరుగురు సెక్యూరిటీ సిబ్బంది ఏడు నెలలుగా జీతాలు అందకపోవడంతో కుటుంబాలు గడవక మంగళవారం విధుల నుంచి తప్పుకున్నారు. కూలీ నాలి చేసుకుని అయినా కుటుంబాలను పోషించుకుంటామంటూ ప్రిన్సిపల్‌కు వినతి పత్రం ఇచ్చి విధుల నుంచి తప్పుకున్నారు. 2019 నుంచి ఈ గురుకులలో వీరు సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు. గత ఆగస్టు నుండి ఇప్పటి వరకు అధికారులు జీతాలు ఇవ్వలేదని ఇప్పటికైనా అధికారులు తమకు చెల్లించాల్సిన జీతాలు చెల్లించాలని వినతిపత్రంలో అధికారులకు విన్నవించుకుని విధుల నుంచి వైదొలిగారు.

విద్యార్థి దశ నుండే ఓటు విలువ తెలుసుకోవాలి

భట్టిప్రోలు, జనవరి 2 : విద్యార్థి దశ నుండే ఓటు విలువను తెలుసుకోవాలని మండల తహసీల్దార్ ధూళిపూడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని వెల్లటూరు జిల్లాపరిషత్ హైస్కూలులో మంగళవారం ఓటు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలను ప్రతి పౌరుడు విధిగా పాటించాలన్నారు. 9వ తరగతి విద్యార్థి మోహనకృష్ణ రూపొందించిన మోడల్ ఈవీఎం పనితీరును పరిశీలించి విద్యార్థి సృజనాత్మకతను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కె. అరుణకుమారి, ఉపాధ్యాయులు గుర్రం మురళీమోహన్, కె. శివరామకృష్ణ, కుటుంబరావు, రెడ్డి సుధాకర్ పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో వికసిత్ భారత్ యాత్ర

వేమూరు, జనవరి 2 : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించేందుకు ప్రారంభించిన వికసిత్ భారత్ యాత్ర కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని జంపని, పోతుమర్రు గ్రామాల్లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా ప్రజలకు అందిస్తున్న పథకాలను అభివృద్ధి కార్యక్రమాలను వీడియో ద్వారా తెలియపరిచారు. జంపనిలో సర్పంచ్ చుండూరు పెద మరియమ్మ, పంచాయితీ కార్యదర్శి వివేకానంద, పోతుమర్రులో మండల వైద్యాధికారి వెంకట సురేష్‌బాబు, పంచాయతీ కార్యాలయ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రూ.3 వేలు పెన్షన్ అందజేత

పిట్టలవానిపాలెం, జనవరి 2 : మండలపరిధిలోని ఖాజీపాలెం గ్రామ సచివాలయంలో మంగళవారం ఎంపీడీవో భవనం మారుతిశేషమాంబ ఆధ్వర్యంలో ఎంపీపీ షేక్ బాజి, ఉప ఎంపీపీ దెందుకూరి సీతారామరాజులతో కలిసి లబ్ధిదారులకు రూ.3 వేలు చొప్పున పెన్షన్ అందజేశారు. ఖాజీపాలెంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష-2 కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వైద్యశిభిరాన్ని ప్రజాప్రతినిధులు పరిశీలించారు. కార్యక్రమానికి ఖాజీపాలెం సర్పంచ్ కుంటం అనూష ప్రసన్న అధ్యక్షత వహించారు. డీఎల్‌డీవో సువార్త, తహసీల్దార్ దాచూరి కవిత, సచివాలయ ఉద్యోగులు, ఈవోపీఆర్డీ కె.పద్మజ, ఎంపీటీసీ కాగిత కాంతకుమారి, సొసైటీ అధ్యక్షుడు కూసంపూడి దేవేంద్రరాజు, గుమ్మడి సీతయ్య, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, వలంటీర్లు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ

బాపట్ల, జనవరి 2 : విశ్వహిందుపరిషత్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని 1, 2, 3 వార్డులలో అయోధ్య అక్షింతలు, రామాలయం ఫొటోలు, కరపత్రాలు ఇంటింటికి పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు పేరాల శేషగిరిరావు, భైరాపట్నం సింగారావు, చీమలదిన్నె శివన్నారాయణ, బండ్రెడ్డి రజనీ, లక్ష్మీ సామ్రాజ్యం, గృహలక్ష్మీ, రోజారాణి, ఉప్పాల నాగరాజు, గ్రంధి నాగేంద్రరావు, సాంబశివరావు తదితరులు మంగళవారం ఈ కార్యక్రమాన్ని వార్డులలో విస్తృతంగా చేపట్టారు.

కోన రఘుపతి పై విమర్శలు అర్థరహితం

● మండల వైసీపీ నాయకులు

పిట్టలవానిపాలెం, జనవరి 2 : ఎమ్మెల్యే కోన రఘుపతిపై పిట్టలవానిపాలెం జడ్పీటీసీ, ఎస్సీ రెడ్డి వైసీపీ వ్యతిరేక వర్గీయులు చేసిన ఆరోపణలు అర్థరహితమని పిట్టలవానిపాలెం మండల వైసీపీ నాయకులు, ఎమ్మెల్యే సానుభూతిపరులు తీవ్రంగా ఖండించారు. జలవనరులశాఖ గెస్ట్‌హౌస్ కార్యాలయంలో మంగళవారం మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, పార్టీనాయకులు మాట్లాడుతూ బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతిపై అవాకులు, చెవాకులు పేలటం మంచి పద్ధతికాదని హెచ్చరించారు. సమావేశంలో వైసీపీ నాయకులు ఎంపీపీ షేక్. బాజి, ఉప ఎంపీపీలు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చేబ్రోలు వీరయ్య, వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఏత్రి అశ్విని, వైసీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, వైసీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవనోపాధుల మెరుగుకు ప్రత్యేక చర్యలు

» కేంద్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి పురుషోత్తమ్ రూపాల



కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే బలరాం తదితరులతో తమ జీవనస్థితిని వివరిస్తున్న మత్స్యకార మహిళ

చీరాల, జనవరి 2: మత్స్యకారుల జీవనోపాధుల మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తమ్ రూపాల అన్నారు. వాడరేవులో మంగళవారం సాగర్ పరిక్రమ ఫేజ్ 10 కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ, మత్స్యకారుల జీవన ప్రమాణాల మెరుగుకు కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. రైతులకు మాదిరిగా కేసీసీ ద్వారా రుణపరపతి మత్స్యకారులకు అందేవిధంగా తీసుకున్న నిర్ణయం వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తోందని చెప్పారు. డీజిల్ రాయితీ, బోట్లు, వలలు కొనుగోలుకు రాయితీ పెంపు తదితర అంశాలకు సంబంధించి మత్స్యకార ప్రతినిధులు ఎరిపిల్లి రమణ, దోనె శ్రీనులు తమ దృష్టికి తెచ్చిన సమస్యలపై సానుకూలంగా స్పందిస్తామన్నారు. వాడరేవులో ఫిషింగ్ హార్బర్ నిర్మాణంకు సంబంధించి టెండరు ప్రక్రియ కూడా పూర్తయిందని చెప్పారు. మత్స్యకారులు తమ దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కానికి పూర్తి స్థాయిలో సహకరిస్తామన్నారు. తమిళనాడు ప్రాంతం నుంచి అనధికారికంగా వచ్చే మత్స్యకారుల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి పురుషోత్తమ్ రూపాల చెప్పారు.

అంతకుముందు స్థానిక మత్స్యకార మహిళ నాయుడు దుర్గ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చేయూత పథకాలను, ఫిష్ ఆంధ్ర దుకాణాలతో అందుతున్న ప్రయోజనాలను వివరించారు. ముందుగా మత్స్యకార ప్రతినిధులు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని రూపాలాకు అందించారు. అనంతరం ఆక్వా కల్చర్ అసోసియేషన్ ప్రతినిధులు తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. అందులో ప్రధానంగా విద్యుత్ సబ్సిడీని ప్రస్తావించారు. నేను రైతు కుటుంబం నుంచి వచ్చానని సమస్యలన్నీ తెలుసునని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

మంత్రి పురుషోత్తమ్ రూపాల ఈనెల 22న అయోధ్యలో జరిగే రామమందిర కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ ఎమ్మెల్యే బలరాం, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, మోపిదేవి వెంకటరమణలకు ఆహ్వానపత్రాలు అందజేశారు. ఈ ఆహ్వానాన్ని అందరి తరఫున ఇస్తున్నామన్నారు. అందరూ అయోధ్య రాలేకపోయినా ఆరోజు ప్రతిఒక్కరూ తమ ఇళ్లలో పూజలు నిర్వహించి దీపం వెలిగించి కొత్త దీపావళిగా సంబరాలు జరుపుకోవాలన్నారు. అనంతరం తీరంలో వలల బరువు, బోట్లు, రెస్క్యూ టీం నిర్వహించే విధులు తీరంలో ప్రయాణానికి ఉపయోగించే బైక్ తదితరాలకు సంబంధించి ఎమ్మెల్యే బలరాం కేంద్రమంత్రి పురుషోత్తమ్ రూపాలకు వివరించారు.

అంతకుముందు కలెక్టర్ రంజిత్‌బాషా మంత్రిని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మంత్రి మత్స్యకారుల ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడారు. 150 మంది మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రూ.48 లక్షల రుణాలు అందజేశారు. రాష్ట్రంలోని తీరప్రాంతాల్లో హార్బర్‌ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో జేసీ సీహెచ్ శ్రీధర్, జాతీయ మత్స్య పరిశ్రమ అభివృద్ధి సంస్థ సీఈవో డాక్టర్ కేఎల్ మూర్తి, ఆర్డీవో సరోజిని, మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, స్థానిక మత్స్యకారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల భిక్షాటన

చీరాల, జనవరి 2: సమాన పనికి, సమాన వేతనం, తదితర తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. మంగళవారం భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద దీక్షా శిబిరంలో కూర్చున్న పారిశుధ్య కార్మికులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. సీఎం జగన్ ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీలను అమలు పరచకుండా మోసం చేస్తున్నారని మండి పడ్డారు. తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. దీక్షలో కూర్చున్నవారికి సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు ఎన్.బాబూరావు, తదితరులు మద్దతు తెలిపారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

అద్దంకిటౌన్, జనవరి 2: మున్సిపల్ కార్మికులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అమలు చేయాలని కేంద్ర మాజీమంత్రి జేడీ శీలం అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారానికి 8వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా మున్సిపల్ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనలు చేస్తూ పట్టణంలోని షాపుల వెంబడి భిక్షాటన చేసి నిరసన తెలియజేశారు. అద్దంకి వచ్చిన జేడీ శీలం ధర్నా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.తిరుపతి రెడ్డి, బీఎస్పీ నాయకుడు జోసఫ్ తదితరులు సంఘీభావం తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

» కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మాజీమంత్రి జేడీ శీలం

అద్దంకిటౌన్, జనవరి 2: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని కేంద్ర మాజీమంత్రి జేడీ శీలం అన్నారు. కాంగ్రెస్‌లోకి అందరూ రావాలని పిలుపునిచ్చారు. స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నుంచి వివిధ పార్టీలలోకి వెళ్ళిన దళిత, క్రైస్తవ, బీసీ, మైనార్టీ, ఇతర వర్గాలవారిని పార్టీలోకి తీసుకువచ్చే విధంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలో ఒక కమిటీగా కలిసి యాత్ర నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ప్రజలు బీజేపీ మీద చాలా కోపంగా ఉన్నారని చెప్పారు. ప్రత్యేక హోదా, పోలవరం, రాజధాని, విశాఖ స్టీల్ ప్లాంట్ వంటి వాటితో పాటు రాష్ట్ర విభజన చట్టంలోని అనేక అంశాల విషయంలో మోసం చేశారన్నారు. రాష్ట్రంలో, దేశంలో నియంతృత్వ పాలన సాగుతుందన్నారు. షర్మిల పార్టీలో చేరికపై అధిష్ఠానం తీసుకునే నిర్ణయాన్ని స్వాగతిస్తామన్నారు. అద్దంకి నియోజకవర్గంలో ఐదు మండలాల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులను ఏర్పాటుచేసి, గ్రామ కమిటీలను వచ్చే నెలనుంచి ఏర్పాటుచేయనున్నట్లు చెప్పారు.

సమావేశంలో మౌర్య శీలం, కోరే సురేంద్రనాథ్, పివ సురేష్‌బాబు, కబల సుబ్రహ్మణ్యం, యర్రమోతు నాగయ్య, నల్లగోర్ల శ్రీనివాసరావు, చెన్నుపల్లి వెంకటేశ్వర్లు, సోమేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి ఒకరికి గాయాలు

మార్టూరు , జనవరి 2: జాతీయ రహదారి మధ్యలో డివైడర్‌ను ఢీకొని ఆటో బోల్తాపడి ఒకరికి గాయాలయ్యాయి. ఈసంఘటన సోమవారం అర్ధరాత్రి ఇసుకదర్శి పాండురంగస్వామి ఆలయ సమీపంలో చోటుచేసుకుంది. విజయవాడకు చెందిన సూరిబాబు తన ఆటోలో బాడుగ సామాన్లు తీసుకుని ఒంగోలు వెళ్లారు అక్కడ సామాన్లు దించి తిరిగి ఖాళీ ఆటోతో విజయవాడ వెళుతుండగా, అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో ఆటో డ్రైవర్ సూరిబాబుకు గాయాలుకాగా, 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రెండు గ్రావెల్ టిప్పర్లు పట్టివేత

అద్దంకిటౌన్, జనవరి 2: గ్రావెల్ తరలిస్తున్న రెండు టిప్పర్లను మంగళవారం పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. వీటిని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. తహసీల్దార్ సుబ్బారెడ్డి రెండు టిప్పర్లకు రూ.20 వేలు జరిమానా విధించారు.

అధ్వానంగా రహదారులు

» పట్టించుకోని అధికారులు » ప్రజలకు తప్పని అవస్థలు


దైవాలరావూరు - రావినూతల మధ్య పడిన గోతులు

మేదరమెట్ల , జనవరి 2: కొరిశపాడు మండలంలోని ప్రధాన రహదారులు గోతులమయంగా మారాయి. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మేదరమెట్ల నుంచి రాచపూడి వరకు ఉన్న 18 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రహదారి గోతులతో నిండిపోయింది. రోడ్డు మార్జిన్‌లు కోసుకుపోవడంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోతులు ప్రమాదకరంగా తయారయ్యాయి. దైవాలరావూరు - రావినూతల మధ్య పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో ఆటోలు, ద్విచక్రవాహనదారులతో పాటు కారులు నడిపేవారు ఎక్కడ ఏ గుంత ఉందో తెలియక ప్రమాదాలబారిన పడుతున్నారు. దైవాలరావూరు - రావినూతల మధ్య రెండు సింగిల్ లైన్‌పైపు కల్వర్లు ఉన్నాయి. ఏదైన వాహనాలు ఎదురు వస్తే కొత్త వారయితే రోడ్డు మార్జిన్‌లో పడిపోవలిసిందే. ఈ కల్వర్టులకు ఉన్న రక్షణ గోడలు పడిపోయాయి. పోలిమేర వద్ద రోడ్డు మార్జిన్ మొత్తం కోసుకుపోయి పది అడుగులకు పైగా గొయ్యి ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాలు పడి మొక్కలు మొలవడంతో దగ్గరకు వచ్చే వరకు ఆ గొయ్యి కనిపించదు. రావినూతల- పమిడిపాడు, పమిడిపాడు - రాచపూడి మధ్య కూడా రోడ్డంతా గోతులతో అస్తవ్యస్తంగా తయారయింది. సుమారు 30వేల మంది జనాభాకు ఉపయోగపడే ఈ రోడ్డు గోతులమయం కావడం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్ అండ్‌బీ అధికారులు తక్షణం స్పందించి కనీస మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

తప్పుడు దరఖాస్తులు చేసిన నలుగురిపై కేసు నమోదు

» ఈఆర్‌వో వెంకటనారాయణ


మాట్లాడుతున్న ఈఆర్‌వో వెంకటనారాయణ

పర్చూరు, జనవరి 2: ఫాం7 ద్వారా బతికి ఉన్న వ్యక్తులను చనిపోయినట్లు తప్పుడు దరఖాస్తు చేసిన మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పర్చూరు నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి వెంకటనారాయణ తెలిపారు. యద్దనపూడిలో ముగ్గురు వ్యక్తులతోపాటు, పర్చూరులో మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధికంగా పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 42,521 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. అందులో ఓట్ల తొలగింపునకు సంబంధించి ఫాం 7 ద్వారా 22,868 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో 10,468 అనర్హతగా గుర్తించి తిరస్కరించినట్లు చెప్పారు. ఫాం 7కు సంబంధించి 12 దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఫాం 8కు సంబంధించి 65 దరఖాస్తులను విచారించాల్సి ఉందన్నారు. ఓట్ల తొలగింపునకు సంబంధించి డిసెంబర్ 9లోపు వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటామన్నారు. తదుపరి వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకోమన్నారు. విచారణకు 7వారాల గడువు నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటున్నట్లు చెప్పారు. అత్యధికంగా నమోద యిన దరఖాస్తులను త్వరితగతిన విచారణ పూర్తిచేయటంతో ఇటీవల విజయవాడలో జరిగిన ఉన్నతస్థాయి అధికారుల సమావేశంలో అభినందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పర్చూరు, యద్దనపూడి, మార్టూరు, కారంచేడు మండలాల తహసీల్దార్‌లు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

51 మందిపై కేసు నమోదు

పర్చూరు నియోజకర్గ పరిధిలో తప్పుడు దరఖాస్తుచేసిన 51 మందిపై కేసు నమోదు చేసినట్టు ఈఆర్‌వో వెంకటనారాయణ తెలిపారు. అందులో బతికిఉన్న వ్యక్తులను చనిపోయినట్లు దరఖాస్తుచేసిన 18 మందిపై ఇప్పటికే కేసులు నమోదుచేసినట్టు చెప్పారు. తాజాగా మంగళవారం పర్చూరు, యద్దనపూడికి సంబంధించి మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. దీంతోపాటు సైబర్ క్రైం ద్వారా తప్పుడు దరఖాస్తుచేసిన 28మందిపై పోలీసులు కేసునమోదు చేశారన్నారు.

అంగన్‌వాడీలపై ప్రభుత్వ వివక్ష

» కార్యకర్తల ధ్వజం
» 21వ రోజుకు చేరిన సమ్మె
» పలుచోట్ల వినూత్న నిరసనలు


పర్చూరు తహసీల్దార్ కార్యాలయం ముందు అంగన్‌వాడీల నిరసన

పర్చూరు, జనవరి 2: తమ న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం కేంద్రాలు మూసివేసి సమ్మెబాట పట్టిన అంగన్‌వాడీలపై ప్రభుత్వం వివక్ష వైఖరిని ప్రదర్శిస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పర్చూరులో అంగన్‌వాడీలు దున్నపోతుకు వినతిపత్రం అందజేసి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. తొలుత స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు మానవహారం నిర్వహించి గౌరవ వేతనం వద్దు , కనీస వేతనం ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. చంటి బిడ్డలతో కార్యాలయం ముందు బైటాయించి గత ఇరవై రోజులకు పైగా సమ్మెబాట పడితే ప్రభుత్వం పట్టించుకోక పోవటం దారుణమన్నారు.

అద్దంకిటౌన్: అంగన్‌వాడీల సమ్మెకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తున్నట్టు కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి 22వ రోజుకు చేరింది. తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నా శిబిరాన్ని జేడీ శీలం సందర్శించి సంఘీభావం తెలిపారు. అంతకుముందు అంగన్‌వాడీ కార్యకర్తలు కోలాట ప్రదర్శనతో నిరసన తెలియజేశారు. బీఎస్పీ నాయకుడు మందా జోసఫ్, ఇతర నాయకులు ధర్నాలో కూర్చుని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నేతలు తంగిరాల వెంకటేశ్వర్లు, పి. తిరుపతిరెడ్డి, రమేష్, జి.శారద, మనోలత, అనిత, అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు: తమ న్యాయమైన కోర్కెలు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పంగులూరులో అంగన్‌వాడీలు తమ నిరసన దీక్షను కొనసాగించారు. కనీస వేతనం, గ్రాట్యువిటీ అమలు విషయంలో ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.


అద్దంకిలో కోలాటం ఆడుతూ పాటలు నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

బల్లికురవ మండలంలోని 64 అంగన్ వాడీ కేంద్రాల కార్యకర్తలు, హెల్పర్లు మంగళవారం సమ్మెలో ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవటం లేదని నిరసనగా దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు. ఈప్రభుత్వానికి బుద్ధిచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని పాటల రూపేణా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సంఘ నేతలు నాగమణి, సరస్వతి, శ్రీలలిత, సునంద, భారతి, సత్యవతి, జ్యోతి, శ్రీదేవి, శివపావని, అనురాధ, అనుపమ, వెంకటరత్నం, వెంకట రమణ, చిన్నమ్మాయి తదితరులు పాల్గొన్నారు.

మేదరమెట్ల: రాష్ట్రంలో 21 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆ యాలు మంగళవారం వినూత్న నిరసన తెలిపారు. కొరిశపాడు మండల కార్యాలయం వద్ద తమ డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాలను దున్నపోతుకు ఇచ్చి నిరసన తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా మాటతప్పి మడమ తిప్పారని ఎం జగన్‌పై ధ్వజమెత్తారు. తమ డిమాండ్లను పరిష్కరించేవరకు ఆందోళన ఆగదని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు.

మార్టూరు: మార్టూరులో అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం దున్నపోతుకు వినతి పత్రం ఇచ్చి ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా నాయకుడు బత్తుల హనుమంతరావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలతోపాటు యూనియన్ నాయకులు రాణి, శ్యామల, సుహాసిని, విజయ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వినూత్న నిరసన


మార్టూరులో దున్నపోతుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఇంకొల్లు, జనవరి 2: మండలంలోని ఇడుపులపాడులో 22వ రోజు సమ్మెలో భాగంగా మంగళవారం అంగన్‌వాడీలు వినూత్నంగా నిరసన తెలిపారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండు చేశారు. గేదెలకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు నాగండ్ల వెంకట్రావు, ప్రాజెక్టు లీడర్లు బిక్కి. సరళ, లక్ష్మీ కుమారి, దేవమణి, సుజాత, లత, పద్మ, అనూరాధ, భారతి, తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవ: ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న నిరవధిక సమ్మె 22వ రోజు కొనసాగింది. బల్లికురవ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండలం

ప్రభుత్వం దిగొచ్చేవరకు పోరు

చీరాల, జనవరి 2: ప్రభుత్వ మెడలు వంచి అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలు సాధించుకునే వరకు సమ్మె కొనసాగుతుందని, అప్పటివరకు తాము పూర్తిగా మద్దతుగా నిలుస్తామని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు ఎన్.బాబూరావు అన్నారు. సమ్మె కొనసాగింపులో భాగంగా మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలకు సీఐటీయూ, సీపీఐ, సీపీఎం బాధ్యులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం బాధ్యులు బేడా వెంకట్రావు, ఎం.వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

కొమ్మమూరు కాలువకు సాగు నీరందించాలి

» ఎమ్మెల్యే కరణం బలరాం

చీరాల, జనవరి 2: కొమ్మమూరు కాలువకు సాగునీరు అందించాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి మంగళవారం ఇరిగేషన్ ఈఎన్‌సీ నారాయణరెడ్డిని కోరారు. ఆయకట్టులోని రైతులు ఎమ్మెల్యే బలరాంకు తమ సమస్య విన్నవించిన నేపథ్యంలో ఈఎన్‌సీతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ ఏడాది సాగునీరు అందించలేమని ముందస్తుగా చెప్పినప్పటికి, అప్పటికే కొందరు మాగాణి సాగుచేసి ఉన్నారని చెప్పారు. ఈనేపథ్యంలో ఈఎన్‌సీ ఎస్‌ఈతో మాట్లాడి సాధ్యాసాధ్యాలను పరిశీలించి సాగునీరు అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని సానుకూలంగా స్పందించారు.

అభివృద్ధి పనుల్లో అలసత్వానికి తావివ్వొద్దు!

నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు పురోగతి తెలుపాలని, అలసత్వం వద్దని ఎమ్మెల్యే కరణం బలరాం సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం నియోజకవర్గంలో జరుగుతున్న అన్ని అభివృద్ధి పనులకు సంబంధించి సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా పనులను వేగవంతం చేయాలని చెప్పారు. తనను కలసిని పలువురితో మాట్లాడుతూ ఎన్నికల వేళ ఒకవిధంగా, మామూలు రోజుల్లో ఒకవిధంగా పనిచేయటం తనకు చేతకాదన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించటం ద్వారా మన్ననలు పొందటమే తన విధానమని చెప్పారు.

ఫిష్ డ్రైయర్ యూనిట్‌తో అధిక ప్రయోజనం

చీరాల, జనవరి 2: ఫిష్ డ్రైయర్ యూనిట్‌తో మత్స్యకారులకు ఎంతో ఉపయోగమని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నా రు. మండలంలోని వాడరేవులో నూతనంగా ఏర్పాటుచేసిన ఫిష్ డ్రైయర్ యూనిట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ప్రభుత్వపరంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, అక్కల శ్రీనివాసరెడ్డి, మచ్చ సువార్త, చావలి వాసు, నర్రా బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

305 మందికి వైద్య పరీక్షలు

చినగంజాం, జనవరి 2: మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అడవీధిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు ఎంపీడీవో కె.స్వరూపరాణి తెలిపారు. సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు కె.కీర్తిసరోజ్, బి.నాగేంద్ర, గైనకాలజిస్ట్ డాక్టర్ షణ్ముఖశ్రీ, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ జి.పృథ్వీలు 305 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా పలువురికి కళ్లజోళ్ళు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మోటుపల్లి సర్పంచ్ వడ్లమూడి సాంబశివరావు, ఈవోపీఆర్డీ ఎస్.వేణుగోపాలకృష్ణమూర్తి, పి.రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెతో పేరుకుపోతున్న చెత్త

చీరాల, జనవరి 2: పారిశుధ్య కార్మికుల సమ్మెతో పట్టణ శివారు ప్రాంతాలలో చెత్త పేరుకుపోతుంది. దీంతో దోమకాటు పెరిగిందని ఆ ప్రాంతాల వారు ఆవేదన చెందుతున్నారు. వ్యాధుల బారిన పడతామని ఆందోళన చెందుతున్నారు. పారిశుధ్య చర్యలను మెరుగు పరచాలని కోరుతున్నారు. ప్రభుత్వం మొండివైఖరి వీడి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆప్రాంతాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం

ఇంకొల్లు, జనవరి 2: మండలంలోని నాగండ్ల గ్రామానికి చెందిన రోటరీక్లబ్ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు తన సతీమణి లక్ష్మీకాంతం జయంతి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయడం అభినందనీయమని రోటరీక్లబ్ అధ్యక్షుడు కరి కమలేశ్వరరావు అన్నారు. పొలిమేర ఆంజనేయస్వామి గుడి ఆవరణలో శ్రీవీరప్రతాప ఆంజనేయస్వామి అన్నదాన సత్రం వద్ద సుమారు రూ.30వేల విలువ కలిగిన సీసీ కెమెరాలను సోమేపల్లి రామ్మోహనరావు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి జెట్టి వెంకటేశ్వర్లు, కోశాధికారి చుండి సాంబశివరావు, సభ్యులు వత్సవాయి రాఘవరాజు, గోరంట్ల నాగేశ్వరరావు, అన్నదాన నిర్వాహకులు పులఖండం బద్రిరెడ్డి, సింహాద్రి వెంకటేశ్వరరెడ్డి, బాచిన నాగేశ్వరరావు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో కళ్ళజోళ్ళ పంపిణీ

పంగులూరు, జనవరి 2: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం కళ్ళజోళ్లను పంపిణీ చేశారు. పంగులూరులో ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించి శుక్లాల ఆపరేషన్ చేయించిన రోటరీక్లబ్ ప్రతినిధులు 40 మందికి కళ్ళజోళ్ళను అందచేశారు. స్థానిక రోటరీక్లబ్ కార్యాలయం ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆప్తాలమిక్ అధికారి డాక్టర్ వై.ఎల్లారెడ్డి సంబంధిత వ్యక్తులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్ళజోళ్ళు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కరణం హనుమంతరావు, షేక్ కాలేషావలి, సీపీఎం నేత నాగబోయిన రంగారావు, చిలుకూరి వీరరాఘవయ్య, గుర్రం ఆంజనేయులు, జాగర్లమూడి సుబ్బారావు, ఆర్వీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావంతో మానసిక ప్రశాంతత


ప్రత్యేక పూజల్లో కొండయ్య

చీరాల, జనవరి 2: భక్తి భావంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. వండలంలోని బుర్లవారి పాలెంలో మంగళవారం భవానీ స్వాములు నిర్వహించిన ఇరుముడి ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

దాతల సాయం మరువలేనిది

అద్దంకిటౌన్, జనవరి 2: భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనిదని ఎంఈవో బుదాటి సుధాకరరావు అన్నారు. మంగళవారం అద్దంకి సత్రంబడి ఆవరణంలోని భవిత విద్యావనరుల కేంద్రంలోని విద్యార్థులకు ఉపాధ్యాయుడు జగన్నాధం బాబురావు వ్రాత అట్టలు, నోట్ పుస్తకాలు, పెన్నులు సమకూర్చగా, ఎంఈవో చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుడు పోలిరెడ్డి సహకారంతో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఇట్టా రామారావు, ఐఈఆర్‌టీలు కొంగల శ్రీనివాసరావు, పాలపర్తి యోనా, సాంబశివరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో పాఠశాలకు కుర్చీలు అందజేత

అద్దంకిటౌన్, జనవరి 2: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మంగళవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక గాజులపాలెంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోటరీ మాజీ అధ్యక్షుడు కొల్లి సురేంద్ర సౌజన్యంతో రెండు జింక్ ర్యాక్‌లను అందజేశారు. గురకాయపాలెం జడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలకు రోటరీ అధ్యక్షుడు మలాది శ్రీనివాసరావు సౌజన్యంతో పది కుర్చీలను అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి గొట్టిపాటి జయసింహా, హెచ్‌ఎం సుజాత, రోటరీ సెక్రటరీ చప్పిడి వీరయ్య, సందిరెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ యు.దేవపాలన, షేక్ మహ్మమద్ రఫీ, నర్రా శ్రీలక్ష్మి, ఆంజనేయులు, హరిప్రసాద్, గోపాలరావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కారు ఢీకొని బైకిస్టుకు గాయాలు

బల్లికురవ, జనవరి 2: మండల పరిదిలోని అద్దంకి - నార్కెట్ పల్లి రాష్ట్రీయ రహదారి కొప్పెరపాడు సమీపంలో గుర్తుతెలియని కారు ఢీకొని ద్విచక్ర వాహనచోదకుడు రాయపూడి వెంకయ్యకు తీవ్రగాయాలయ్యాయి. ముండ్లమూరు మండలం రహణారెడ్డిపాలెంకు చెందిన రాయపూడి వెంకయ్య బైకుపై బల్లికురవ మండలం సూరేపల్లి వస్తున్నాడు. ఈక్రమంలో కొప్పెరపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వెనుక నుంచి గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న వెంకయ్య 15 అడుగుల మేర ఎగిరి రోడ్డు మార్జిన్‌లోకి పడిపోయాడు. బాటసారులు ప్రమాదాన్ని గమనించి వెంటనే నామ్ రోడ్డు అంబులెన్స్‌కు సమాచారం అందించటంతో క్షతగాత్రుడిని నర్సారావుపేట వైద్యశాలకు తరలించారు.

వరకట్న వేధింపులపై ఫిర్యాదు

బల్లికురవ, జనవరి 2: మండలంలోని గుంటుపల్లి మహిళా పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్న గోళ్ల సుమలత తనను భర్త, అత్తమాలు, ఆడపడుచు వరకట్న వేధింపులకు గురిచేస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.వేమన తెలిపారు. సుమలతకు కారంచేడుకు చెందిన గోళ్ల వెంకటేశ్వరరావుతో వివాహమైంది. భర్త మానసికంగా వేధింపుతలతో పాటు శారీరకంగా వేధిస్తున్నాడని పేర్కొంది. భర్తతో పాటు అత్తామామలు శ్రీనివాసరావు, విజయలక్ష్మి, ఆడపడుచు నాగమల్లేశ్వరి వరకట్నం కింద అధిక నగదు తీసుకు రావాలని తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారని పేర్కొంది. ఈమేరకు మహిళా పోలీసు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు పలుగ్రామాల నాయకులతో గొట్టిపాటి సమీక్ష

అద్దంకిటౌన్, జనవరి 2: మండలంలోని పలు గ్రామాలలోని టీడీపీ నాయకులతో బుధవారం జొన్నతాళిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమీక్ష నిర్వహించన్నారు. మండలంలోని మణికేశ్వరం, శింగరకొండపాలెం గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జ్‌లు, బూత్ ఏజెంట్‌లు, పేజి నేస్తం సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

అద్దంకిటౌన్, జనవరి 2: ఆర్టీసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ తులసీరామ్ డిమాండ్ చేశారు. మంగళవారం అద్దంకి వచ్చిన ఆయన డిపోలోని కార్మికులతో మాట్లాడారు. కార్మికుల సమస్యలపై డిపో అధికారులకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా తులసీరామ్ మాట్లాడుతూ ప్రతినెలా పదో తేదిలోపు కార్మికులకు జీతాలు చెల్లించాలని, ప్రతి ఆరు నెలలకు పెరిగే డీఏ బకాయిలను అరియర్స్ రూపంలో కార్మికులకు చెల్లించాలన్నారు. ఈఎస్ఐలో కార్మికుల కుటుంబ సభ్యులందరిని నమోదు చేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బాపట్ల జిల్లా గౌరవాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు తిరుపతిరెడ్డి, శ్రీనివాసరావు ఉన్నారు.